జనరాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 4 సంచిక - 14 పక్షపత్రిక ఆగస్టు 1-15, 2013

## తెలంగాణ ఏర్పాటుకు కేంద్రం నిర్ణయం




**సీమాంధ్ర యువతలో భయాందోళనలు తొలగించే చర్యలూ ప్రకటించాలి**



## 2014 ఎన్నికల సర్వే



# నిజామాబాద్ పర్యటనలో డా॥ జయప్రకాష్ నారాయణ్

















జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక ఆగస్టు 1-15, 2013

సంపుటి - 4 సంచిక - 14

## లోపలి పేజీల్లో...

తెలంగాణా రాష్ట్రం ఏర్పాటుకు
కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం.............................. 5
కొత్తరాష్ట్రాల ఏర్పాటు ఇలా........................................ 6
రాజకీయ నేతల క్రీడలకు బలిపశువులు కావద్దు........ 8
లోక్‌సభలో ఏ కూటమికీ మెజారిటీ రాదు................. 10
విపక్షాల అనైక్యతే కాంగ్రెస్‌కు బలం........................... 11
ఉత్తరాదిలో భాజపా హవా...................................... 12
బెల్టుషాపులు తొలగించే వరకు మహిళలు పోరాడాలి. 13
పంచాయితీ ఎన్నికలు - పార్టీల బుకాయింపులు..... 14
దళితులు : చిల్లర వ్యాపారంలో విదేశీ పెట్టుబడులు. 16
రాజ్యాంగం మార్పులకు సృజనాత్మక ఒత్తిడే మార్గం. 18
వ్యక్తి స్వేచ్ఛ, సామాజిక న్యాయం,
సమానత్వం వైపు పురోగమనం .............................. 21
పేదరికంతో పరాచికం............................................... 24
సమాజ హితమే రాజమౌళి అభిమతం.................... 25
జిల్లాలలో లోక్‌సత్తా పార్టీ కార్యక్రమాలు.................... 26

## సంపాదకవర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

**డి.వి.వి.యస్. వర్మ**
సంపాదకులు

**సంపాదక వర్గం**
జి. రాజారెడ్డి
బండారు రామ్మోహన్‌రావు
కొంగర గంగాధరరావు
కె.వి. కుటుంబరావు
సి.హెచ్.ఎస్. మాధవరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి
ఫొటోలు : ఎన్. సంజీవ్ కుమార్

# పంచాయితీల ఆలనాపాలనా చూడండి

## సంపాదకీయం

పంచాయితీలకు ఎన్నికలు జరిగాయి. కొత్త సర్పంచులు అధికారాన్ని చేపట్టారు. ఇక గ్రామాల ఆలనాపాలనా చూడాల్సిన బాధ్యత వారిమీద వుంది. అందుకు తగిన ఏర్పాట్లు చెయ్యడం ప్రభుత్వం విధి కావాలి.

పంచాయితీ ఎన్నికలలో ప్రధాన పాత్రధారులుగా వున్న కాంగ్రెస్, తెదేపా, వై.కా.పా.లు ఈ ఎన్నికలను కేవలం 2014 అసెంబ్లీ ఎన్నికలకు బల నిరూపణ లక్ష్యంతోనే పనిచేశాయి. డబ్బు, మద్యం, ఇతర ప్రలోభాలతో ఉక్కిరిబిక్కిరి చేశాయి. కాని పంచాయితీల పటిష్టత గురించి ఒక్కరూ నోరు మెదపలేదు. తమ హయాంలో పంచాయితీలకు చాలా చేశామంటూ ప్రత్యర్థులు దానిని వమ్ముచేశారంటూ పరస్పర ఆరోపణలతో చేసిన వ్యాఖ్యలు విమర్శలు తప్ప ఈ పార్టీలు నిర్దిష్టంగా స్థానిక ప్రభుత్వాల మీద తమ వైఖరిని ప్రజలకు స్పష్టం చెయ్యలేదు.

ఈ పార్టీలన్నీ ఎప్పుడో ఒకప్పుడు అధికారాన్ని వెలగబెట్టినవే. తమ పార్టీ 17 అంశాలు దఖలు పర్చిందంటే దానికి అదనంగా మరో పది అంశాలు పంచాయితీలకు దఖలు పర్చామని వారు బుకాయిస్తున్నారు. నిజానికి ఈ పార్టీలలో ఒక్కటి కూడా పంచాయితీలకు దఖలు పర్చాల్సిన 29 అంశాలకు సంబంధించిన శాఖల్ని జిల్లా పరిషత్‌ల అధీనంలోకి తెచ్చే ప్రయత్నం చెయ్యలేదు. ఏ ఒక్క పార్టీ కూడా ఈ 29 అంశాలలో ఏ అధికారాలు జిల్లా పరిషత్‌కు, మండల పరిషత్‌కు, గ్రామ పంచాయితీకి నిర్దిష్టంగా దఖలు పడేది తేల్చలేదు. పనికిమాలిన ప్రభుత్వ ఉత్తర్వులతో అధికారాలు దఖలు పర్చామంటూ సమీక్షలు, సలహాలు, సూచనలు చేసే పద్ధతిలో అధికారాలు దఖలు పర్చి దాన్ని నీరుగార్చారు.

ఇక రెండోది ఎవరు ముఖ్యమంత్రి అయితే వారి వ్యక్తిగత ప్రతిష్ట పెంచుకోడానికి పంచాయితీలను సాధనం చేసుకున్నారు. అధికారాలు, నిధులు దఖలు పర్చకుండా జన్మభూమి పేరుతో ఒకరు, పల్లెబాట పేరుతో మరొకరు, రచ్చబండ పేరుతో ఇంకొకరు నేరుగా ముఖ్యమంత్రులే గ్రామాభివృద్ధి పర్యవేక్షకుల వేషాలతో ప్రజల్ని మభ్యపెట్టి తమ పబ్బం గడుపుకున్నారు. ఇక ఈ మాటల నాటకాలను కట్టిపెట్టి ప్రభుత్వం ప్రధాన ప్రతిపక్షాలు పంచాయితీల పట్ల తమ వైఖరిని నిర్దిష్టంగా ప్రకటించాలి.

ఒకటి : 29 అంశాలకు సంబంధించిన అన్ని ప్రభుత్వ శాఖలను జిల్లా పరిషత్ పరిధిలోకి తెచ్చి దానిని జిల్లా ప్రభుత్వాలుగా (మున్సిపాలిటీలతో సహా) ప్రకటించాలి.

రెండు : పంచాయితీలు, మండల పరిషత్‌లకు నిర్దిష్టంగా ఈ అంశాలపై అధికార విభజనను ప్రకటించాలి.

మూడు : రాష్ట్ర ఆర్థిక కమీషన్‌ను తక్షణం ఏర్పాటు చెయ్యడం. అది సూచించిన ఆర్థిక వనరుల కేటాయింపులను పూర్తిగా అమలు చెయ్యడం.

నాలుగు : ప్రతి గ్రామానికి, మున్సిపల్ వార్డులకు జనాభా ప్రాతిపదికన తలసరి సంవత్సరానికి కనీసం 1000 రూపాయల గ్రాంటును ప్రకటించి విడుదల చెయ్యాలి.

అయిదు : పంచాయితీలలో, మున్సిపాలిటీలలో అవినీతిని నిరోధించడానికి ప్రతి జిల్లాలో ఒక అంబుడ్స్‌మన్ వ్యవస్థని నెలకొల్పాలి. వెంటనే ఈ చర్యలు తీసుకోకపోతే పంచాయితీ ఎన్నికలు ఫార్సుగా మారతాయి. ఎన్నికైన ప్రజా ప్రతినిధులు ఉత్సవ విగ్రహాలు అవుతారు. ప్రజలకు మెరుగైన వసతులు, సేవలు ఎండమావులు అవుతాయి. ■



దయచేసి
భవనం దగ్గరగా
అలా
చేయకండి
భవనం
కూలిపోతుంది

# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.


**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**

*8-2-674బి/2/9, ప్లాట్ నం : 93*
*హ్యాపీ వ్యాలి, రోడ్ నం. 13ఎ,*
*బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034*

ఫోన్ నంబర్లు :
***040- 23311817, 23311819, 23311820, 23312829***
ఫ్యాక్స్ : ***040-23310612***
accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com


## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311817**

విడి ప్రతి : రు. *10* ,
ఏడాది చందా : రు. *200*
మూడేళ్ళ చందా : రు. *500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోమని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ కాంగ్రెస్ పార్టీ అత్యున్నత విధాన నిర్ణాయక వేదిక అయిన వర్కింగ్ కమిటీ రెండు పేజీల తీర్మానాన్ని విడుదల చేసింది. మొదట ఈ అంశానికి సంబంధించి వర్కింగ్ కమిటీ గుర్తించిన అంశాలను పాయింట్ల వారీగా ఏకరువు పెట్టింది. ఆ తర్వాత తెలంగాణ ఏర్పాటు క్రమంలో కేంద్రం తీసుకోవాల్సిన చర్యలను తీర్మానిస్తూ పాయింట్ల రూపంలో పేర్కొంది. చివరన అన్ని కోణాల్లో ఆలోచించాకే నిర్ణయం తీసుకున్నామని, అందరి సౌఖ్యం కోసం అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేసింది. ప్రకటన పాఠం ఈ విధంగా ఉంది...

**2013 జులై 30న జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం గుర్తించిన అంశాలు**

- ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణ ప్రాంత ప్రజల్లోని చాలా వర్గాల దీర్ఘకాల డిమాండ్ ఇది. తమ సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఇతర ఆకాంక్షలను మెరుగ్గా నేరవేర్చుకొనేందుకు ప్రత్యేక రాష్ట్రం కావాలని వారు కోరుతున్నారు.
- 2004 ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల సందర్భంగా భారత జాతీయ కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ ప్రస్తావన ఉంది.
- 2004 మే నెలలో యూపీఏ-1 ప్రభుత్వ కనీస ఉమ్మడి కార్యక్రమంలో, జూన్ నెలలో పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి చేసిన ప్రసంగంలో 'సంప్రదింపుల తర్వాత, విస్తృతాభిప్రాయ సాధన ద్వారా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు' గురించి ప్రస్తావించడమైనది.
- 2009 ఫిబ్రవరి 12న అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ఒక ప్రకటన చేస్తూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.
- తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు ప్రతిపాదనపై 2009 డిసెంబర్ 7న అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కె. రోశయ్య అధ్యక్షతన హైదరాబాద్‌లో జరిగిన అఖిలపక్ష సమావేశంలో వ్యక్తమయిన అభిప్రాయాలు.
- 2009 డిసెంబర్ 9న అప్పటి కేంద్ర హోంమంత్రి చిదంబరం చేసిన ప్రకటన. ఆ తర్వాత తగిన సంప్రదింపుల తర్వాత 2009 డిసెంబర్ 23న హోంమంత్రి చేసిన మరో ప్రకటన.
- ఆంధ్రప్రదేశ్‌లోని ఎనిమిది గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో 2010 జనవరి 5న, 2011 జనవరి 6న ఢిల్లీలో జరిగిన రెండు సమావేశాల్లో వ్యక్తపరచిన అభిప్రాయాలు.
- 2010 డిసెంబర్ 30న జస్టిస్ బి.ఎన్.శ్రీకృష్ణ కమిటీ వివిధ అవకాశాలతో ఇచ్చిన నివేదిక.
- గత మూడు సంవత్సరాల వ్యవధిలో ఏఐసీసీ ఆంధ్రప్రదేశ్ వ్యవహారాల ప్రతినిధులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వేర్వేరు తేదీల్లో ఏర్పాటు చేసిన పలు సమావేశాల్లో రాజకీయ పార్టీలు, రాజకీయ నాయకులు, ఎన్నికైన ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల వారు వ్యక్తపరచిన అభిప్రాయాలు.

**కింది వాటిపై కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని తీర్మానించడమైనది**

- భారత రాజ్యాంగాన్ని అనుసరించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవడం.
- అదే సమయంలో నదీ జలాల పంపిణీ, విద్యుత్ ఉత్పత్తి,

(తరువాయి 6వ పేజీలో....)

# కొత్త రాష్ట్రాల ఏర్పాటు ఇలా...

**కొత్త రాష్ట్రం ఏర్పాటుకు ఒక నిర్దిష్టమైన ప్రక్రియ ఉంది. ఆ ప్రక్రియలో ప్రతి పనికీ నిర్దిష్ట వ్యవధి ఉంది. ఈ ప్రక్రియకు కనీసం దాదాపుగా 200 రోజుల సమయం పడుతుందని కేంద్ర-రాష్ట్ర సంబంధాల విభాగం తెలియజేస్తున్నా రాజకీయ, ఇతర అవసరాలను బట్టి ఆ వ్యవధిలో గణనీయంగానే మార్పు ఉండొచ్చు.**

**అంశాలు :**

1. **కేబినెట్ నోట్ :-**

- **కార్యాచరణ :** కొత్త రాష్ట్రం ఏర్పాటు ప్రతిపాదనపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కేంద్ర మంత్రివర్గానికి నోట్‌ను సమర్పిస్తుంది.
- **వ్యవధిసుమారుగా :** 30 రోజులు
- **బాధ్యులు :** హోం శాఖ

2. **మంత్రివర్గ ఉపసంఘం పరిశీలన :-**

- **కార్యాచరణ :** ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం సూత్రప్రాయ ఆమోదం తెలిపిన తర్వాత మంత్రివర్గ ఉపసంఘం, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు.. కొత్త రాష్ట్రం ఏర్పాటులోని ఆర్థిక అంశాలను పరిశీలిస్తారు. **ఈ ఉపసంఘంలో ఉండే మంత్రులు :** హోం, ఆర్థిక, విద్య, ఆరోగ్య, సాగునీరు, విద్యుత్తు, పర్యావరణం-అడవులు, రైల్వే, మానవవనరుల అభివృద్ధి, రసాయనాలు-ఎరువులు, ఆహారం-వినియోగదారుల వ్యవహారాలు, కార్మిక శాఖల మంత్రులు.
- **వ్యవధిసుమారుగా :** 90 రోజులు

---

(5వ పేజీ తరువాయి....)

పంపిణీ, మూడు ప్రాంతాల్లో నివసిస్తున్న పౌరులందరికి పరిరక్షణ, భద్రత, ప్రాథమిక హక్కులకు హామీ వంటి విషయాల్లో ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల ప్రజల ఆందోళనలను పట్టించుకోవడానికి నిర్ణీత కాల వ్యవధిలో క్రియా విధానాన్ని (మెకనిజం) సంస్థాపించి నడిపించడం.

- తెలంగాణ ఏర్పడిన తర్వాత రెండు రాష్ట్రాలకు పదేళ్లపాటు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉంటుందని ప్రకటించడం. ఈ పదేళ్లపాటు ఉమ్మడి రాజధానిలో రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు సమర్థంగా పని చేయడానికి తగిన చట్టపరమైన, పాలనాపరమైన చర్యలను తీసుకోవడం.
- మిగిలిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పదేళ్ల వ్యవధి లోపల కొత్త రాజధాని నిర్మించుకోవడానికి సహాయం చేయడం.
- పోలవరం సాగునీటి ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి, దాన్ని పూర్తి చేయడానికి తగినన్ని నిధులు ఇవ్వడం.
- ఆంధ్రప్రదేశ్‌లోని వెనుకబడిన ప్రాంతాలు / జిల్లాల ప్రత్యేక అవసరాలను గుర్తించడం, ఆ ప్రాంతాల అభివృద్ధికి తగినన్ని నిధులు ఇవ్వడం.
- ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రెండు రాష్ట్ర ప్రభుత్వాలకు... అన్ని ప్రాంతాల్లో / జిల్లాల్లో శాంతి భద్రతల పరిస్థితిని అదుపులో ఉంచడానికి, శాంతి సామరస్యాలు నెలకొల్పడానికి సహకరించడం.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు నిర్ణయం తేలిగ్గా ఏమీ జరగలేదని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ చెప్పదలచుకొంది. సాధ్యమైనంత విస్తృత సంప్రదింపుల అనంతరమే, 1956 నుంచి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర డిమాండు వెనుక చరిత్రలోని మంచి చెడులను పరిగణనలోకి తీసుకున్నాకే నేటి ఈ నిర్ణయం తీసుకోవడమైనది. ఇరు రాష్ట్రాల్లోని అన్ని వర్గాల ప్రజలకు శాంతి, సమ్మతి, ప్రగతి, సిరి సంపదలు సమకూరే విధంగా ఈ తీర్మానాన్ని మనసా వాచా కర్మణా తుచ తప్పకుండా అమలు చేసేందుకు పూర్తి సహకారం అందించాలని కాంగ్రెస్‌లోని సోదర సోదరీ మణులందరికీ, తెలుగు మాట్లాడే ప్రజలందరికీ, ఆంధ్రప్రదేశ్‌లో నివసిస్తున్న వారందరికీ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ విజ్ఞప్తి చేస్తోంది. ■

- **బాధ్యులు :** మంత్రుల బృందం

**3. బిల్లుపై కేబినెట్ నోట్ :-**

- **కార్యాచరణ :** మంత్రివర్గ ఉపసంఘం నుంచి సిఫార్సులు/ సూచనలు వచ్చిన తర్వాత మంత్రివర్గం ఆమోదం కోరుతూ కేబినెట్ నోట్ ఖరారు.
- **వ్యవధిసుమారుగా :** 15 రోజులు
- **బాధ్యులు :** హోం శాఖ

**4. కేబినెట్ ఆమోదం :-**

- **కార్యాచరణ :** మంత్రివర్గ ఉపసంఘం చేసిన సిఫార్సులను పేర్కొంటూ మంత్రివర్గం ఆమోదం కోసం కేంద్ర హోం మంత్రిత్వశాఖ.. కేబినెట్ నోట్‌ను సమర్పిస్తుంది. అందులో ఈ విజ్ఞప్తులు చేస్తుంది.
  1. ఫలానా రాష్ట్రం ఏర్పాటు చేసే బిల్లును ఆమోదించాలి.
  2. రాష్ట్రశాసనసభకు బిల్లు పంపించాల్సిందిగా రాష్ట్రపతికి సిఫార్సు చేయాలి.
  3. వేరుపడే రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులు సజావుగా ఉండేలా తీసుకోవాల్సిన చర్యలను సిఫార్సు చేయడానికి ఆర్థిక మంత్రిత్వశాఖ నిపుణుల సంఘాన్ని ఏర్పాటు చేయాలి. 4. కొత్త రాజధానితో ఏర్పాటయ్యే రాష్ట్రంలో అభివృద్ధి కోసం ప్రణాళిక సంఘంలో ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడి ప్రత్యక్ష పర్యవేక్షణలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలి. కేంద్రం నుంచి సరిపడా నిధులు అందుకోవడంలో, మౌలిక సదుపాయాలు సహా ఆ రాష్ట్ర సర్వోతోముఖాభివృద్ధికి అవసరమయ్యే చర్యలు తీసుకోవడంలో ఈ విభాగం ప్రత్యేక దృష్టి పెడుతుంది.
- **వ్యవధిసుమారుగా :** 7 రోజులు
- **బాధ్యులు :** హోం శాఖ

**5. రాష్ట్రపతి సిఫార్సు :-**

- **కార్యాచరణ :** బిల్లును రాష్ట్ర శాసనసభకు పంపించాల్సిందిగా రాష్ట్రపతికి సిఫార్సు చేస్తూ ప్రధాని, హోం మంత్రి ద్వారా హోం మంత్రిత్వ శాఖ ఒక నోట్ పంపిస్తుంది.
- **వ్యవధిసుమారుగా :** 2 రోజులు
- **బాధ్యులు :** హోం శాఖ

**6. బిల్లుపై శాసనసభ, మండలి పరిశీలన :-**

- **కార్యాచరణ :** రాష్ట్ర శాసనసభ, శాసనమండలి ఆ బిల్లును పరిశీలించి వాటి అభిప్రాయాలు తెలియజేయాలి.
- **వ్యవధి సుమారుగా :** 30 రోజులు (సమావేశాలు జరుగుతుంటే)
- **బాధ్యులు :** రాష్ట్రం

**7. న్యాయ మంత్రిత్వ శాఖ పరిశీలన :-**

- **కార్యాచరణ :** ముసాయిదా బిల్లులో చేర్చిన సిఫార్సులతో కూడిన కేబినెట్ నోట్‌ను న్యాయమంత్రిత్వ శాఖ పరిశీలన కోసం పంపుతారు
- **వ్యవధిసుమారుగా :** 7 రోజులు
- **బాధ్యులు :** న్యాయమంత్రిత్వ శాఖ

**8. కేబినెట్ నోట్ :-**

- **కార్యాచరణ :** ముసాయిదా బిల్లును న్యాయమంత్రిత్వ శాఖ పరిశీలించిన తర్వాత మంత్రివర్గ ఆమోదం కోసం పంపుతారు.
- **వ్యవధి సుమారుగా :** 8 రోజులు
- **బాధ్యులు :** హోం శాఖ

**9. బిల్లు ప్రవేశ పెట్టేందుకు నోటీసు :-**

- **కార్యాచరణ :** లోక్‌సభ / రాజ్యసభలో బిల్లును ప్రవేశ పెట్టడానికి నోటీసు ఇస్తారు.
- **వ్యవధిసుమారుగా :** 2 రోజులు
- **బాధ్యులు :** హోం శాఖ

**10. అవసరమైన మెజారిటీ :-**

- **కార్యాచరణ :** బిల్లును ఆమోదించడానికి సాధారణ మెజారిటీ సరిపోతుంది.
- **వ్యవధిసుమారుగా :** 15 రోజులు
- **బాధ్యులు :** పార్లమెంటు

**11. రాష్ట్రపతి ఆమోదం :-**

- **కార్యాచరణ :** పార్లమెంట్ ఉభయసభల్లోనూ బిల్లు ఆమోదం పొందిన తర్వాత రాష్ట్రపతి ఆమోదం కోసం పంపుతారు.
- **వ్యవధి సుమారుగా :** 2 రోజులు
- **బాధ్యులు :** హోం శాఖ ■

# తెలంగాణా రాష్ట్రం ఏర్పాటు ఉపద్రవం కాదు

# రాజకీయ నేతల క్రీడలకు బలిపశువులు కావద్దు

**- యువతకు జేపీ విన్నపం**

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు వ్యతిరేకంగా కొన్ని రాజకీయ శక్తులు రెచ్చగొడుతున్న ఉద్యమాలలో బలిపశువులు కావద్దని, ఆ రాజకీయాల ఉచ్చులో పడవద్దని కోస్తా, రాయలసీమలోని ప్రజలకు, ముఖ్యంగా యువతకు లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు ప్రజల అవసరాల గురించి కాకుండా స్వప్రయోజనాలతో వ్యవహరించటం, కేంద్రం ఫుట్‌బాల్ ఆడుకోవటంతో గత మూడేళ్లుగా జరుగుతున్న ఆందోళనల వల్ల తెలంగాణ ప్రాంతం, రాజధాని హైదరాబాద్ తీవ్రంగా నష్టపోయాయని, ఇప్పుడు ఈ ప్రాంతం కుదుటపడాలని, తిరిగి అదే తప్పును కోస్తా, సీమలో చేయవద్దని అన్నారు. ముఖం బాగోలేదని ముక్కును తెగ్గోసుకుంటామా? అని ప్రశ్నించారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ని ప్రతిపక్షంగా ఉన్నప్పుడు ఓట్ల కోసం తొలుత కాంగ్రెస్ పార్టీ లేవనెత్తిందని, తర్వాత ప్రతిపక్షంగా ఉన్నప్పుడు తెలుగుదేశం అదే బాటలో నడిచిందని, నిర్ణయం తీసుకునే బాధ్యతను కేంద్రానికే వైకాపా అప్పచెప్పిందని, ఇప్పుడిక ఆ రాష్ట్రం ఏర్పాటుపై రగడ చేయటం అర్థరహితమని జేపీ అన్నారు. ఈవేళ కావలసింది ఆవేశం, హింస స్థానంలో విచక్షణ, ఒకరినొకరు అర్థంచేసుకోవటమని, దూరదృష్టితో మనందరి ఉమ్మడి ప్రయోజనాలను పరిరక్షించుకుని, ప్రపంచం ముందు మసకబారిన తెలుగువారి గౌరవాన్ని తిరిగి ప్రతిష్టించుకోవాలని అన్నారు.

కేంద్రంలో అధికారంలో ఉన్న యూపీయే, కాంగ్రెస్ పది జిల్లాలతో కూడిన తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు ప్రక్రియను వేగంగా పూర్తిచేస్తామని చేసిన ప్రకటనపై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కటారి శ్రీనివాసరావుతో కలిసి బుధవారం ఇక్కడ లోక్‌సత్తా పార్టీ ప్రధాన కార్యాలయంలో జయప్రకాష్ నారాయణ్ మీడియాతో మాట్లాడారు.

**జేపీ మాట్లాడుతూ...** ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు ఆకాంక్షని లక్షలాది మంది యువత పదేపదే ఎన్నికల ప్రక్రియ ద్వారా వ్యక్తం చేశారని, జాతీయస్థాయిలో రెండు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీల మధ్య ఏకాభిప్రాయం కారణంగా తాజాగా కేంద్రం చేసిన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటనను లోక్‌సత్తా పార్టీ స్వాగతిస్తోందని తెలిపారు. సమగ్ర, సామరస్య పరిష్కారంలో భాగంగా వచ్చే తెలంగాణను ఆహ్వానిస్తామని లోక్‌సత్తా తొలినుంచీ చెబుతోందని, ఇప్పుడు యూపీయే ప్రకటించిన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమగ్రంగా, సామరస్యంగా ఉండేలా చేయాల్సిన బాధ్యత ప్రధానంగా కాంగ్రెస్ పార్టీదని అన్నారు. తాంబూలాలిచ్చాం తన్నుకు చావండి అనే రీతిలో వ్యవహరించకుండా అసెంబ్లీలో ఆ ప్రకటన ఆమోదం పొందేలా అందరినీ ఒప్పించాలని, అందరికీ నచ్చచెప్పి సంతృప్తికరమైన పరిష్కారాలతో ఆమోదింపచేయకుండా ఏకపక్షంగా, సామ్రాజ్యవాద ధోరణితో వ్యవహరించటం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని, ఇది దీర్ఘకాలంలో దేశప్రయోజనాలకు ప్రమాదకరమని హెచ్చరించారు.

“తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ప్రకటన విషయంలో, అందరి ప్రయోజనాలనీ పరిరక్షిస్తామనే విశ్వాసాన్ని కలిగిస్తూ అన్ని ప్రాంతాలవారినీ భాగస్వాముల్ని చేయటంలో యూపీయే, కాంగ్రెస్ ఖచ్చితంగా విఫలమైంది. ఒక రాద్ధాంతంలా ప్రకటన చేసింది. మాకు నచ్చింది చేస్తాం, ఏం చేసుకుంటారో చేసుకోండన్నట్టు వ్యవహరించింది. కేంద్రం చేసిన ప్రకటన కన్నా ఆ ప్రకటన చేసిన తీరు ప్రజల్ని, ముఖ్యంగా రాయలసీమ వారిని బాగా గాయపరిచింది. ఇది తెలుగువారి ఆత్మగౌరవ పోరాటం దాకా వెళ్లకుండా కేంద్రం తన ధోరణిని మార్చుకుని అందరినీ కూర్చోబెట్టి అన్ని పక్షాలకూ కొంత అసంతృప్తి, కొంత సంతృప్తి కలిగే విధంగా మొత్తం మీద అందరికీ ఆమోదయోగ్యంగా పరిష్కారాన్ని అమలు చేయాలి. హిందీ తర్వాత అతిఎక్కువమంది ప్రజలు మాట్లాడే భాష ఉన్న రాష్ట్రాన్ని, తొలి భాషాప్రయుక్త రాష్ట్రాన్ని విడదీసేటప్పుడు చాలా ముందుచూపుతో, బాధ్యతాయుతంగా వ్యవహరించాలి” అని జేపీ అన్నారు.

రాష్ట్రంలో వెనకబాటుతనం అన్ని ప్రాంతాలలో ఉన్నప్పటికీ రాయలసీమ ఒక ప్రాంతంగా వెనకబడి ఉందని, ఉత్తరాంధ్రలో పేదరికం ఎక్కువగా ఉందని, తెలంగాణలో విపరీతమైన ఆశలున్నాయని, వీటన్నిటినీ పరిష్కరించేలా కేంద్రప్రభుత్వం ఉదారంగా ముందుకొచ్చి నిధుల్ని, ఇతర అన్ని రకాల తోడ్పాటునూ అందించాలని జేపీ డిమాండ్ చేశారు.

రాయలసీమ – కోసాంధ్ర ప్రాంతానికి ఏర్పడబోయే కొత్త రాజధాని ఎక్కడ అన్నదాన్ని వివాదాస్పదం చేసుకుని ఆ ప్రాంతంలో తిరిగి ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టకోకుండా ఉభయ ప్రాంతాలకు ఆమోదయోగ్యంగా అందుబాటులో ఉండే విధంగా రాజధాని ఏర్పాటుకు నిర్ణయం చేసుకోవాలని, దీనికి కేంద్రం పెద్దఎత్తున నిధుల్నివ్వాలని అన్నారు.

## హైదరాబాదీలూ! నిర్భయంగా బతకండి

హైదరాబాద్‌లో కోస్తా, సీమ నుంచే కాకుండా దేశం నలుమూలల్నుంచీ వచ్చిన లక్షలాదిమంది ఉన్నారని, ముస్లింలు పెద్దసంఖ్యలో ఉన్నారని వీరంతా నిర్భయంగా బతకొచ్చని, తమ వృత్తివ్యాపారాలు చేసుకోవచ్చని జేపీ స్పష్టంచేశారు. ఇది రాజ్యాంగం ఇచ్చిన హక్కని, సామరస్యానికి, సహనానికి ప్రతీకైన హైదరాబాద్‌లో దీనికి వ్యతిరేకంగా ఎవరు ప్రవర్తించినా సహించరాదని అన్నారు. ‘‘హైదరాబాద్ నగరం తెలుగువారందరిదీ, దేశం మొత్తానిదీ, గత మూడేళ్లుగా ఇతర నగరాలకంటే వెనకబడిపోయింది, ఇప్పటికైనా ఈ నగరానికి పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షించి జాతీయస్థాయిలో తలమానికంగా తయారు చేసుకోవాలి” అని జేపీ పేర్కొన్నారు.

అంతా రాజధానిలో ఉండటమే ఇంత పంచాయతీకి కారణం, చిన్న నగరాల్ని ఇబ్బడిముబ్బడిగా పెంచుకుందాం

మరోవైపు, రాజధాని నగరం రాజకీయ అధికారం, ఆర్థిక వ్యవస్థ, విద్య, సాంకేతిక రంగాలన్నిటికీ కేంద్రబిందువవటం ఎంతటి అసమానతలకి దారితీస్తుందో హైదరాబాద్ ఉదంతం రుజువు చేస్తున్నదని జేపీ అన్నారు. ప్రస్తుత ఆందోళనలన్నీ హైదరాబాద్ వల్లే ప్రధానంగా తలెత్తాయన్నారు. అమెరికాలాంటి దేశాలలో చాలామేరకు మహానగరాలు కాకుండా ఆల్బనీ (న్యూయార్క్ రాష్ట్రం), తలహాసీ (ఫ్లోరిడా రాష్ట్రం), శాక్రమెంటో (కాలిఫోర్నియా), స్ప్రింగ్‌ఫీల్డ్ (ఇల్లినాయిస్ రాష్ట్రం) లాంటి చిన్ననగరాలు రాజధానులుగా ఉంటాయన్నారు. శాసనసభ, హైకోర్టు, ఇతర వ్యవస్థలు వేర్వేరు నగరాలలో ఉండటం మనకు ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటి చోట కూడా ఉందని గుర్తుచేశారు. మనం కూడా తెలంగాణలో, కొత్తగా ఏర్పడే రాష్ట్రంలో వీలున్నన్ని నగరాలని, చిన్న పట్టణాలని అభివృద్ధి చేసి, మన ప్రభుత్వ సంస్థలని, పరిశ్రమలను, మౌలిక సదుపాయలని అన్ని చోట్లా పంపిణీ చేయటం అవసరమని, లేకుంటే భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి పొరపాట్లే పునరావృతమవుతాయని హెచ్చరించారు.

పోలవరం ప్రాజెక్టుకు జాతీయహోదా ఇస్తున్నట్టు కేంద్రప్రభుత్వం చేసిన ప్రకటనను జేపీ స్వాగతించారు. ఇది గోదావరి డెల్టాకు సంబంధించిన ప్రాజెక్టు కాదని, రాష్ట్రంలో సమగ్ర జలవనరుల పంపిణీ పథకమని అన్నారు. కృష్ణా జలాలు కృష్ణా డెల్టాకు వెళ్లాల్సిన అవసరం లేకుండా శ్రీశైలం నుంచి రాయలసీమకు, నాగార్జునసాగర్ ఎడమకాలువ నుంచి తెలంగాణకు వెళ్లేందుకు వీలుగా గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌లోకి మళ్లించి కృష్ణా డెల్టా రైతులకు నీరివ్వాలంటే పోలవరం తప్పనిసరి అని జేపీ పునరుద్ఘాటించారు.

ప్రాణహిత–చేవెళ్ల భారీ ఎత్తిపోతల పథకం అసంబద్ధమైనదని, అది తెలంగాణకు గుదిబండగా మారుతుందని లోక్‌సత్తా నుంచీ చెబుతోందని, అవే నిధుల్ని తెలంగాణ ప్రాంత అభివృద్ధికి, యువతకు ఉపాధి అవకాశాల్ని కల్పించటానికి వినియోగించాలని ఓ ప్రశ్నకు జవాబుగా జేపీ చెప్పారు.

జిల్లా ప్రభుత్వాలు లేకుండా కొత్త రాష్ట్రాల వల్ల మార్పు రాదు. అధికారాన్ని వికేంద్రీకరించి ఎన్నికైన కౌన్సిల్‌తో ‘జిల్లా ప్రభుత్వాల’ను ఏర్పాటు చేసి రాష్ట్ర బడ్జెట్ నుంచి గ్రామ, వార్డు స్థాయిలోకి నేరుగా కనీసం 10శాతం నిధుల కేటాయింపు, పౌరసేవలను హక్కుగా అందించే ఏర్పాటు, అవినీతి నిరోధానికి వ్యవస్థలు, అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు అందించకుండా కొత్తరాష్ట్రం ఏర్పాటు వల్ల ప్రజల జీవితాలలో ఎటువంటి మార్పూ రాదని, వీటి కోసం బలమైన పోరాటం చేయాల్సి వుందని జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

లోక్‌సత్తా పార్టీ ఉపాధ్యక్షుడు బండారు రామ్మోహనరావు, కార్యదర్శి నందిపేట రవీందర్ సమావేశంలో పాల్గొన్నారు. ■

# లోక్‌సభలో ఏ కూటమికీ మెజారిటీ రాదు

## సియస్‌డియస్ పోల్ సర్వే అంచనా

**2014** ఎన్నికల జోరు అందుకుంది. జాతీయ స్థాయిలో పార్టీలు, కూటములు ఇందుకు సన్నాహాలు చేసుకుంటున్నాయి. బి.జె.పి. తన ప్రచార సారధిగా మోడీని రంగంలోకి దించింది. ఆయనే కాబోయే ప్రధానిగా పరోక్షంగా ప్రచారాన్ని సాగిస్తున్నది. మరోపక్క కాంగ్రెస్ పార్టీ దిగజారిన ప్రతిష్టను చక్కదిద్దుకోడానికి ఆహార భద్రత, నగదు బదిలీ, ఇతర హక్కు చట్టాలతో సన్నద్ధం అవుతున్నది. నవంబరులో ఎన్నికలు జరిగే రాష్ట్రాలతో పాటు ముందస్తు ఎన్నికలకు కూడా కసరత్తు చేస్తున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. అందులో భాగంగానే తెలంగాణా రాష్ట్ర ప్రకటనను వేగవంతం చేసినట్లు భావిస్తున్నారు.

ఈ నేపథ్యంలో సి.యన్.యన్, ది హిందూ పత్రికల ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ డెవలెపింగ్ సొసైటీ సంస్థ ఒక ఎన్నికల సర్వేను నిర్వహించి జూలై 24 నుండి ఫలితాల ప్రకటనలు చేసింది. తక్షణం ఎన్నికలు నిర్వహిస్తే బి.జె.పి. కూటమి కొన్ని స్థానాలు అదనంగా గెల్చుకున్నా అది మెజారిటీకి చాలా దూరంగా వుందని అలాగే కాంగ్రెస్ కూటమికి స్థానాలు తగ్గినా ఆ కూటమి కూడా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగల స్థితిలో లేదని స్పష్టం చేసింది.

బి.జె.పి. కూటమికి, కాంగ్రెస్ కూటమికి జాతీయ స్థాయిలో 29 ఓట్ల శాతంతో సమానంగా వున్నాయి. కాని బి.జె.పి. కూటమికి 172-180 లోక్‌సభ స్థానాలు వస్తాయని, కాంగ్రెస్ కూటమికి 149 నుండి 153 స్థానాలు వస్తాయని అంచనా వేసింది. ఈ రెండు కూటముల మధ్య 22 సీట్లు మాత్రమే తేడా వుందని ప్రకటించింది.

ఈ సర్వే ఫలితాలకు కొన్ని మినహాయింపులున్నాయని ప్రకటించింది.

మొదటిది- ఈ సర్వేలో 18 రాష్ట్రాలే వున్నాయని, జమ్మూ-కాశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, అస్సాం మినహా మిగిలిన ఈశాన్య రాష్ట్రాలు, ఢిల్లీ మినహా మిగిలిన కేంద్ర పాలిత ప్రాంతాలు ఈ సర్వేలో లేవని ఇందులో 32 లోక్‌సభ స్థానాలుండగా గతంలో 16 కాంగ్రెస్, 7 బి.జె.పి.లకు వున్నాయని పేర్కొంది.

రెండవది- జార్ఖండ్‌లో ఇటీవల కాంగ్రెస్ పార్టీ జార్ఖండ్ ముక్తి మోర్చాతో చేసుకున్న ఒప్పందం తర్వాత జరిగే పరిణామాలు, అలాగే ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణా రాష్ట్రం ప్రకటిస్తే వచ్చే ఫలితాలను పరిగణనలోకి తీసుకోలేదని తెలియజేసింది.

2009 ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోని యు.పి.ఎ. ప్రభుత్వం అనేక అవినీతి కుంభకోణాలు, ధనం పెరుగుదల వంటి అంశాలతోపాటు, తృణమూల్ కాంగ్రెస్, డి.యం.కె. పార్టీలను దూరం చేసుకున్న స్థితిలో కూడా బి.జె.పి. నాయకత్వంలోని యన్.డి.ఎ. కూటమి ఈ పరిస్థితిని పూర్తిగా వినియోగించుకోలేక పోయిందని పేర్కొంది. ఈ నేతల మధ్య కీచులాటలతోపాటు, అది కూడా కర్ణాటక తరహా అవినీతి మచ్చలు తగిలించుకుంది.

2014లోగా ఈ రెండు పార్టీలు తమ స్థితిని మార్చుకునే అవకాశాలున్నాయా? కాంగ్రెస్ పార్టీ జార్ఖండ్‌లో జె.యం.యం.తో జతకట్టింది, ఎన్నికలు దగ్గర పడే కొద్దీ బెంగాల్‌లో మమతా బెనర్జీతో, బీహార్‌లో జెడి(యు)తో లేదా

**(తరువాయి 13వ పేజీలో....)**

**సీఎస్‌డీఎస్ సర్వే ఫలితాలు**

| పార్టీ / కూటమి | 2013లో సీట్లు (అంచనా) | ఓట్ల శాతం |
|---|---|---|
| యూపీఏ (కాంగ్రెస్ 131-139) | 149-157 | 29 |
| ఎన్డీఏ (బీజేపీ 156-164) | 172-180 | 29 |
| వామపక్షాలు | 22-28 | 6 |
| బీఎస్పీ | 15-19 | 6 |
| ఎస్పీ | 17-21 | 4 |
| * ఇతరులు | 147-155 | 26 |

**(* టీఎంసీ 23-27, ఏడీఎంకే 16-20, జేడీయూ 15-19, బీజేడీ 12-16, వైసీపీ 11-15, ఆర్జేడీ 8-12, టీడీపీ 6-10, టీఆర్ఎస్ 5-9, మొత్తం : 147-155)**

# విపక్షాల అనైక్యతే కాంగ్రెస్‌కు బలం

- ఆంధ్రప్రదేశ్‌లో అదే వరం
- సీఎన్ఎన్ ఐబీఎన్ - ది హిందూ సర్వే

పరస్పరం తలపడే ప్రతిపక్షాలు ఎన్ని ఉంటే... అధికార పక్షానికి అంత మంచిది! ఇదే విషయం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోనూ రుజువు అయ్యే అవకాశముందని 'సీఎన్ఎన్ ఐబీఎన్ – ది హిందూ' సర్వే చెబుతోంది. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ గెలుపు అవకాశాలు సన్నగిల్లుతున్నప్పటికీ... ఆంధ్రప్రదేశ్‌లో మరో ప్రత్యామ్నాయం లేకపోవడం కాంగ్రెస్‌కు వరమయ్యే అవకాశముందని ఈ సర్వే తెలిపింది. 'విపక్షాల్లో చీలిక కాంగ్రెస్‌కు వరం' అని పేర్కొంది. 2009లో చేసిన సర్వేతో పోల్చితే... కాంగ్రెస్ పరిస్థితి బాగా మెరుగుపడిందని తెలిపింది. వైఎస్ చనిపోకముందు చేసిన సర్వేలో కాంగ్రెస్‌కు 39 శాతం మద్దతు లభించింది. అది ఇప్పుడు 32 శాతానికి తగ్గినప్పటికీ... వైసీపీ (20 శాతం), టీడీపీ (17 శాతం) కంటే బాగా ముందుందని సర్వే తెలిపింది. టీఆర్ఎస్, వైసీపీ వంటి పార్టీల వల్లే టీడీపీ మూడో స్థానానికి పరిమితమైందని పేర్కొంది. తమిళనాడులోనూ కాంగ్రెస్ పరిస్థితి మెరుగుపడినట్లు తెలిసింది. తమిళనాడులో అధికార అన్నాడీఎంకే ఓట్ల శాతం 3 పాయింట్లు పెరిగినప్పటికీ, ఇప్పటికిప్పుడు సార్వత్రిక ఎన్నికలు జరిగితే కాంగ్రెస్, బీజేపీ లబ్ధిపొందుతాయని ఈ సర్వేలో వెల్లడైంది. ఇక కర్ణాటకలోనూ ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ పార్టీ అత్యధిక ఎంపీ స్థానాలు కైవశం చేసుకుంటుందని ఈ సర్వే తెలిపింది. కేజేపీ, బీఎస్సార్ కాంగ్రెస్ విలీనమైతే తప్ప బీజేపీ పరిస్థితి మెరుగుపడే అవకాశంలేదని అభిప్రాయపడింది. మొత్తంగా కాంగ్రెస్‌కు 15 నుంచి 20 ఎంపీ స్థానాలు... బీజేపీ 5 నుంచి 6, జేడీఎస్ 3 లేదా నాలుగు స్థానాలు గెలవొచ్చునని తెలిపింది.

యూపీఏ–2 ప్రభుత్వం అవినీతిమయమైపోయిందని మూడింట రెండొంతుల మంది అభిప్రాయపడుతున్నారు. గత నాలుగేళ్లలో భారీగా అవినీతి పెరిగిందన్నారు.

## గుజరాత్, మహారాష్ట్రల్లో అధికార పక్షాలదే హవా

పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, గుజరాత్‌లలో రాజకీయ పరిస్థితిలో 2009 నుంచి ఏ మార్పు లేదని తాజాగా జరిగిన సర్వేలో తేలింది. వచ్చే ఏడాది జరిగే సాధారణ ఎన్నికల్లో ఈ రాష్ట్రాల్లోని ప్రస్తుత అధికార పార్టీలే అధిక స్థానాలు దక్కించుకుంటాయని సీఎస్‌డీఎస్–సీఎన్ఎన్ ఐబీఎన్ ఎలక్షన్ ట్రాకర్ సర్వేలో వెల్లడైంది. మహారాష్ట్రలో అధికార కాంగ్రెస్–ఎన్సీపీ కూటమి, గుజరాత్‌లో నరేంద్రమోడీ నాయకత్వంలోని బీజేపీనే మెజారిటీ సీట్లు గెలుచుకుంటాయని సర్వే ఫలితాల ద్వారా తెలుస్తోంది. దీని ప్రకారం మహారాష్ట్రలో 2009లో 39 శాతం ఓట్లు సాధించిన కాంగ్రెస్– ఎన్సీపీ కూటమి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో 43 శాతం ఓట్లు పొందే అవకాశం ఉంది. ఎంపీ స్థానాలు కూడా గరిష్ఠంగా 27 వరకు రావచ్చు. ■






# ఉత్తరాదిలో భాజపా హవా

ఉత్తరాదిలో భాజపా పుంజుకుందని సీసీడీఎస్-సీఎన్ఎన్-ఐబీఎన్ ఎన్నికల ట్రాకర్ సర్వేలో తేలింది. ఇప్పటికిప్పుడు లోక్‌సభకు ఎన్నికలు నిర్వహిస్తే ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్.. ఈ మూడు రాష్ట్రాల్లోనూ ఆ పార్టీ గణనీయ సంఖ్యలో సీట్లు సాధించ నున్నట్లు వెల్లడయింది. ముఖ్యంగా... కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో కీలకమైన పెద్ద రాష్ట్రం ఉత్తరప్రదేశ్‌లో భాజపాకు పూర్వవైభవం రానున్నట్లు సర్వే ఫలితాలు చెబుతున్నాయి. ఇక్కడ చతుర్ముఖ పోటీలోనూ ఆ పార్టీ పైచేయి సాధిస్తుందని తేలింది. ఇక మధ్యప్రదేశ్‌లో భాజపా గాలికి కాంగ్రెస్ తుడిచి పెట్టుకు పోనుంది. రాజస్థాన్ లోనూ కమలదళం బాగానే పుంజు కుంది. ఇక్కడ అధికార కాంగ్రెస్‌కు గట్టిపోటీ ఇస్తుందని వెల్లడయింది.

**సర్వేలో తేలిన ముఖ్యాంశాలు...**

- రాజస్థాన్‌లో కాంగ్రెస్ ఓట్ల శాతం తగ్గనుంది. 2009లో 47 శాతం కాగా ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే 44 శాతానికి పరిమితం కావచ్చు. భాజపాకు గత ఎన్నికల్లో వచ్చిన ఓట్లు 37 శాతం కాగా ఈ సారి 44 శాతం రావచ్చు.
- మధ్యప్రదేశ్ ప్రజలు ప్రధాని అభ్యర్థిగా నరేంద్రమోడీ కన్నా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌నే ఎక్కువగా కోరుకుంటున్నారు. ఈ విషయంలో మోడీకి మద్దతు 28 శాతం కాగా చౌహాన్‌కు మద్దతు 49 శాతం. చౌహాన్ పరిపాలనపై సంతృప్తి 2011లో 75 శాతం ఉండగా ఈ ఏడాదిలో 82 శాతానికి పెరిగింది. ఇక్కడ భాజపాకు పడే ఓట్లు 50 శాతం, కాంగ్రెస్‌కు 32 శాతం మాత్రమే.
- ఉత్తరప్రదేశ్‌లో యువ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ ప్రభావం బాగా తగ్గింది. పరిపాలనకు సంబంధించి దాదాపు అన్ని ప్రధాన అంశాల్లోనూ ఆయనకు తక్కువ మార్కులే పడ్డాయి. సమాజ్‌వాదీ పార్టీ మద్ధతుదారుల్లోనూ ఆయన కంటే ఆయన తండ్రి ములాయంకే ఎక్కువ మార్కులు పడ్డాయి. ములాయం ఉత్తమ ముఖ్యమంత్రి అని భావిస్తున్న పార్టీ మద్ధతుదారులు 67 శాతం కాగా అఖిలేష్ ఉత్తమ ముఖ్యమంత్రి అని భావిస్తున్నవారు 20 శాతం మాత్రమే.
- ఉత్తరప్రదేశ్‌లో భాజపా ఉత్తమ పరిపాలన అందిస్తుందని విశ్వసిస్తున్నవారు 28 శాతం. ఈ విషయంలో బీఎస్పీకి మద్ధతు పలికిన వారు 19 శాతం, సమాజ్‌వాదీ పార్టీకి మద్ధతు పలికిన వారు 16 శాతమే. కాంగ్రెస్ 13 శాతంతో అన్ని పార్టీలకన్నా వెనకబడింది.
- ఓట్ల శాతంలోనూ భాజపా ఈ రాష్ట్రంలో పుంజుకుంది. ఆ పార్టీకి 2009లో వచ్చిన ఓట్లు 18 శాతం కాగా ఈ సారి 27 శాతానికి పెరగనుంది. కాంగ్రెస్ ఓట్లు 18 శాతం నుంచి 16 శాతానికి పడిపోనున్నాయి. సమాజ్‌వాదీ పార్టీ ఓట్లు ఒక శాతం, బహుజన్ సమాజ్ వాదీ పార్టీ ఓట్లు ఏడు శాతం పడిపోనున్నాయి. ■

| ఉత్తరప్రదేశ్ (80 స్థానాలు) | | |
|---|---|---|
| 2009 | పార్టీలు | జూలై 13 |
| 23 | ఎస్పీ | 17-21 |
| 21 | కాంగ్రెస్ | 11-15 |
| 20 | బీఎస్పీ | 14-18 |
| 10 | భాజపా | 29-33 |
| 6 | ఇతరులు | 0-2 |

| మధ్యప్రదేశ్ (29 స్థానాలు) | | |
|---|---|---|
| 2009 | పార్టీలు | జూలై 13 |
| 16 | భాజపా | 21-25 |
| 12 | కాంగ్రెస్ | 2-6 |
| 1 | బీఎస్పీ | 0-4 |

| రాజస్థాన్ (25 స్థానాలు) | | |
|---|---|---|
| 2009 | పార్టీలు | జూలై 13 |
| 20 | కాంగ్రెస్ | 10-14 |
| 4 | భాజపా | 10-14 |
| 1 | ఇతరులు | 0-2 |

# 'బెల్టు షాపులు తొలగించే వరకు మహిళలు పోరాడాలి'



## సనత్‌నగర్

మద్యం తాగించి నోట్లు వెదజల్లి సీట్లు సంపాదించిన పాలకులు ఎలాంటి పరిపాలన అందిస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. లోక్‌సత్తా పార్టీ సనత్‌నగర్ కమిటీ ఆధ్వర్యంలో 'మద్య నియంత్రణపై జన చైతన్య సభ' పద్మారావునగర్‌లోని స్వరాజ్య ప్రెస్ ఆవరణలో సభ జరిగింది. మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకున్న పరిస్థితి రాష్ట్రంలో దాపురించిందని, బెల్టు షాపులను తొలగించి మద్యాన్ని నియంత్రించాలని కోరుతుండగా తాజాగా పర్మిట్ రూమ్‌లకు అనుమతి ఇవ్వడం దారుణమని జేపీ అన్నారు. పరిస్థితిలో మార్పు రావాలంటే మహిళలు, యువకులు తెగువ చూపించాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధురాలు మల్లు స్వరాజ్యం మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామ వాతావరణం పాడైందని, తాగుడుకు బానిసలైన వారితో గ్రామాలు తల్లడిల్లుతున్నాయన్నారు. బెల్టు షాపులను తొలగించే వరకు మహిళలు దండయాత్ర చేయాలని, మద్యం మాటెత్తని, డబ్బులు ఆశచూపని నిజాయితీ పరులను ప్రజలు ఎన్నుకోవాలని సూచించారు. భారతీయం సంస్థ అధ్యక్షురాలు సత్యవాణి మాట్లాడుతూ వ్యవస్థ పాడవుతోందని గుర్తించిన తాము వారిని వదిలి మహిళలను, యువకులను చైతన్యవరచాలని సంకల్పించమన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో తాము ఇంటింటికి తిరిగి మద్యం వల్ల కలిగే అనర్థాలపై చేస్తున్న ప్రచారానికి మంచి స్పందన వస్తోందని నియోజకవర్గం అధ్యక్షురాలు హైమాప్రవీణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకురాళ్లు సరోజాదేవి, గీతామూర్తి, నగర అధ్యక్షుడు డి.రాము, భవాని, రాజీవ్, సాయి, కిరణ్ పాల్గొన్నారు. కళాకారులు ఆలపించిన స్ఫూర్తి కలిగించే గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

---

**(10వ పేజీ తరువాయి...)**

ఆర్.జె.డి.తో పొత్తు తెచ్చుకునే వీలు వుండవచ్చు. అలాగే తెలంగాణా రాష్ట్ర ప్రకటన ఆంధ్రప్రదేశ్‌లో కొంత సానుకూలతను పొందవచ్చునని అంచనా వేసింది.

అది కాకుండా ఆహార భద్రత చట్టం, నగదు బదిలీ, భూసేకరణ బిల్లుల వల్ల కాంగ్రెస్ కూటమికి లబ్ధి చేకూరుతోందని సర్వేలో వెల్లడైంది.

ఇక బి.జె.పి.కి కూడా కొన్ని సానుకూలతలు వున్నాయి. పట్టణ ప్రాంతాలలో బి.జె.పి. తన సంప్రదాయ పునాదిని ప్రత్యేకించి, విద్యార్థులలో, మధ్య తరగతి వర్గాలలో, హిందూ అగ్రవర్ణాలలో తిరిగి తెచ్చుకోగల స్థితిలో వుంది. ఇది బి.జె.పి.కి కొత్త ఊపునిచ్చేది మాత్రమేగాని మెజారిటీకి సరిపోదని, మోడీ మ్యాజిక్ మీద అది ప్రధానంగా ఆధారపడాల్సి వుంది.

ఈ ప్రధాన కూటములకు దేనికి మెజారిటీ రాని స్థితిలో ఎన్నికల తర్వాత కాంగ్రెస్ కూటమితో జత కట్టే ఇతర పార్టీలు బి.జె.పి.తో జతకట్టే వాటి కంటే ఎక్కువగా వుండే అవకాశాలున్నాయి.

ఈ రెండు కూటములు ప్రభుత్వాలను ఏర్పాటు చేయలేకపోతే మరో ఫ్రంటు ఎలానూ వుంటుంది. అవి కాంగ్రెస్ లేదా బి.జె.పి.ల మద్దతుతో ప్రభుత్వాలను ఏర్పాటు చేయవలసి వస్తుంది. ఇప్పుడు మోడీ, రాహుల్ మధ్య సాగుతున్న పోరు నితీష్‌కుమార్, మాయవతి, ములాయంసింగ్, మమతా బెనర్జీల చుట్టూ తిరుగుతుంది. వారు సాధించుకునే స్థానాలు వారిని బలపర్చడానికి కాంగ్రెస్, బి.జె.పి.లు తీసుకునే వైఖరి మీద వారి భవితవ్యం ఆధారపడి వుంటుంది.

దేశంలో రాజకీయ అనిశ్చితి తప్పేలా లేదు. ■

# పంచాయితీ ఎన్నికలు - పార్టీల బుకాయింపులు

రాష్ట్రంలో 21000 పంచాయితీలకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలు పార్టీ రహితంగా జరిగాయి. కాని పార్టీల ప్రమేయంతోనే జరిగాయి. పార్టీల అభ్యర్థులుగానే వారు ప్రచారం సాగించుకున్నారు. కండువాలు కప్పుకున్నారు. బొమ్మలు పెట్టుకున్నారు. ఇవి పార్టీ రహితంగా జరిగినా ఫలితాలను బట్టి పార్టీల ప్రభావాన్ని అంచనా వేసుకోడానికి కొంత మేర వీలుంది. అలాగే గెలిచిన వాళ్లంతా తమ వాళ్లేనని చెప్పుకోడానికి వీలుంది. ఎన్నికలైన తర్వాత ప్రతి పార్టీ తామే నెంబర్‌వన్‌గా ప్రకటించుకున్నాయి. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో మాదే విజయం అని ఢంకా బజాయిస్తున్నాయి.

ఈ పంచాయితీ ఎన్నికలు తరుణంలోనే రాష్ట్ర విభజన సమస్య ముందుకొచ్చింది. దీంతో పంచాయితీ ఫలితాల మీద జరగాల్సిన చర్చ అంతగా జరగలేదు. ఇప్పుడు రాష్ట్రంలో ఒక పక్క సంబరాలు మరో పక్క సమర నినాదాల హోరులో దీనిని పట్టించుకునే అవకాశాలు లేవు.

ప్రతి పత్రికకు ఒక లెక్క, ప్రతి ఛానల్‌కు ఒక లెక్క, ప్రతి పార్టీదీ మరో లెక్కగా పంచాయితీ ఫలితాలున్నాయి. అయినా వీటన్నింటినీ పరిశీలిస్తే రాష్ట్రం మొత్తం మీద కాంగ్రెస్ మొదటి స్థానంలో, తెలుగుదేశం పార్టీ రెండవ స్థానంలో (పెద్ద తేడా లేకుండా) వుండగా మూడో స్థానంలో వైకాపా, తర్వాత తెరాసాలున్నాయి. బిజెపి, వామపక్షాలు, ఇతర పార్టీలు అంతంత మాత్రంగా వున్నాయి. ఇది స్థూల చిత్రంగా చెప్పుకోవచ్చు.

ఈ ఎన్నికలలో మరో ప్రత్యేకత ఏమంటే వేలం పాటలను పక్కన పెడితే ఏకగ్రీవమైన పంచాయితీలు గణనీయంగా వున్నాయి. అంతకుమించి స్వతంత్రుల గెలుపు చాలా పెద్ద సంఖ్యలో వుంది. అలాగే డబ్బు, మద్యం పాత్ర విస్తారమైంది.

ఈ నేపథ్యంలో 2014 ఎన్నికలలో పంచాయితీ ఎన్నికల ప్రభావాన్ని కేవలం అంకెల ఆధారంగా కాకుండా విశ్లేషణ చేసుకోవడం అవసరం.

ఒకటి ఏకగ్రీవాలు, స్వతంత్రుల ఎన్నిక ఒక ప్రత్యేకత. శాసనసభ ఎన్నికల్లో ఇలాంటివి అనూహ్యామైనవి. పంచాయితీలలోనే ఇది సాధ్యం. ఒక పక్క పార్టీ రహితం కావడం దీనికి దోహదం చేసినా అదొక్కటే కారణం కాదు. గ్రామంలో ప్రజలు అక్కడి అవసరాలకు తగిన వ్యక్తిని పార్టీలకు అతీతంగా ఎంచుకోవడం ప్రధానం. పంచాయితీలలో పార్టీల పాత్ర వున్నా వ్యక్తుల పాత్ర కీలకం అవుతుంది. అందువల్లనే ఇంతమంది స్వతంత్రులు ఎన్నికయ్యారని మనం గుర్తుంచుకోవాలి.

ఇక రెండవది కాంగ్రెస్, తెదేపాల గెలుపులో రాజకీయ కోణం కంటే ఈ పార్టీలకు గ్రామస్థాయిలో వున్నా సంస్థాగత నిర్మాణం, గుర్తింపు పొందిన నాయకత్వం వుండడం ప్రధాన కారణంగా కనిపిస్తున్నది. ఇవి దీర్ఘకాలంగా కొనసాగుతున్న పార్టీలు కావడం, ఎప్పుడో ఒకప్పుడు అధికారంలో వుండి కొన్ని పనులు చేసినవిగా వుండడం వీటి విజయానికి దోహదం చేసినట్లు కనిపిస్తున్నది.

ఇక వైకాపా ఒక సెంటిమెంటు మీద, తెరాసా మరో సెంటిమెంటు మీద ఏర్పడిన పార్టీలు. ఈ సెంటిమెంట్లు బలంగా వున్నమాట నిజం. అనేక సర్వేలు దీనిని ధృవీకరిస్తున్నాయి. అయినా అవి పంచాయితీ ఎన్నికల్లో వెనకబడ్డాయి. గ్రామ స్థాయిలో ఈ పార్టీలకు ఒక స్థిరమైన నాయకత్వ కొరత వల్లనే అవి వెనకబడినట్టు కనిపిస్తున్నది.

మొత్తం మీద మనం కొన్ని నిర్ధారణలకు రావచ్చును. మొదటిది ఒక గ్రామం మీద ప్రభావం చూపగల వ్యక్తులుంటే వారికి విజయాలు వచ్చాయి.

రెండవది గ్రామస్థాయి వరకు సంస్థాగత నిర్మాణం లేదా స్థిరమైన నాయకత్వం వున్న చోట్ల ఆయా పార్టీలకు విజయాలు వచ్చాయి. సెంటిమెంటు అన్నది రాష్ట్ర స్థాయి ఎన్నికలకు పనిచేసిన తీరులో గ్రామ పంచాయితీలు, మున్సిపల్ స్థాయి ఎన్నికల్లో పనిచేయదని కూడా అర్థం అవుతున్నది.

అందువల్ల పంచాయితీ ఎన్నికలకు వున్న పరిమితుల పరిధిలోనే ఈ ఫలితాలను విశ్లేషణ చేసుకోవాలి. 2014 ఎన్నికలలో ఈ పరిమితులు, పరిధులు వేరుగా వుంటాయన్నది నమూనాలో వుంచుకోవాలి. అంతేగాని బుకాయింపులతో పార్టీలకు మంచి ఫలితాలు రావు. ■

**మూడో దశ పంచాయతీ ఎన్నికల ఫలితాలు, మొదటి, రెండో దశ ఫలితాలు + ఏకగ్రీవాలు అన్నీ కలిపి ఇప్పటివరకు మొత్తం ఫలితాలు**

| | కాంగ్రెస్ | | తెదేపా | | వైకాపా | | తెరాస | | ఇతరులు | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| జిల్లా | మూడోదశ | ఏకగ్రీవాలు + 3 విడతలు కలిపి | మూడోదశ | ఏకగ్రీవాలు + 3 విడతలు కలిపి | మూడోదశ | ఏకగ్రీవాలు + 3 విడతలు కలిపి | మూడోదశ | ఏకగ్రీవాలు + 3 విడతలు కలిపి | మూడోదశ | ఏకగ్రీవాలు + 3 విడతలు కలిపి |
| శ్రీకాకుళం | 125 | 414 | 90 | 369 | 30 | 151 | – | – | 38 | 156 |
| విజయనగరం | – | 365 | – | 271 | – | 166 | – | – | – | 109 |
| విశాఖపట్నం | 92 | 243 | 135 | 332 | 64 | 223 | – | – | 27 | 122 |
| తూ.గోదావరి | 86 | 289 | 84 | 314 | 35 | 208 | – | – | 36 | 138 |
| ప.గోదావరి | 44 | 209 | 52 | 323 | 51 | 192 | – | – | 32 | 153 |
| కృష్ణా | 78 | 177 | 131 | 399 | 100 | 264 | – | – | 41 | 112 |
| గుంటూరు | 47 | 170 | 134 | 435 | 88 | 288 | – | – | 20 | 150 |
| ప్రకాశం | 40 | 214 | 41 | 349 | 76 | 318 | – | – | 12 | 134 |
| నెల్లూరు | 72 | 272 | 90 | 239 | 81 | 287 | – | – | 14 | 126 |
| చిత్తూరు | 121 | 265 | 147 | 474 | 173 | 421 | – | – | 57 | 217 |
| అనంతపురం | 77 | 243 | 127 | 442 | 107 | 253 | – | – | 29 | 66 |
| కర్నూలు | 78 | 352 | 70 | 184 | 69 | 238 | – | – | 45 | 109 |
| కడప | 22 | 176 | 68 | 145 | 98 | 405 | – | – | 11 | 56 |
| మహబూబ్‌నగర్ | 105 | 437 | 64 | 326 | 11 | 126 | 63 | 128 | 106 | 305 |
| రంగారెడ్డి | 90 | 201 | 63 | 210 | 03 | 18 | 36 | 84 | 43 | 153 |
| మెదక్ | 166 | 422 | 111 | 194 | 11 | 11 | 25 | 285 | 35 | 133 |
| నిజామాబాద్ | 61 | 264 | 18 | 158 | 0 | 06 | 63 | 176 | 51 | 112 |
| ఆదిలాబాద్ | 117 | 233 | 34 | 126 | 33 | 33 | 91 | 208 | 92 | 223 |
| కరీంనగర్ | 55 | 350 | 28 | 143 | 01 | 18 | 112 | 377 | 83 | 317 |
| వరంగల్ | 66 | 221 | 83 | 215 | 12 | 31 | 167 | 332 | 51 | 139 |
| నల్గొండ | 166 | 501 | 89 | 247 | 09 | 50 | 09 | 152 | 47 | 208 |
| ఖమ్మం | 56 | 59 | 107 | 112 | 85 | 89 | 01 | 01 | 88 | 106 |
| మొత్తం | 1764 | 6077 | 1766 | 6007 | 1137 | 3796 | 567 | 1743 | 958 | 3344 |

★ విజయనగరం జిల్లాలో రెండు విడతల్లోనే పోలింగ్ ముగిసింది.

## ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీలు

| | | |
|---|---|---|
| మొత్తం స్థానాలు | : | 21,590 |
| షెడ్యూల్డ్ ప్రాంతాలకు చెందినవి | : | 1218 |
| అవిపోగా మిగిలినవి | : | 20,372 |
| ఎస్టీలకు | : | 2,497 |

(ఇందులో షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని 1218 సీట్లున్నాయి. ఇవన్నీ ఎస్టీలకే కేటాయించారు)

| | | |
|---|---|---|
| ఎస్సీలకు | : | 3,958 |
| బీసీలకు | : | 6,929 |
| జనరల్ | : | 8,209 |
| మహిళలకు | : | 10,795 |

(అన్ని కేటగిరీల్లో కలిపి)

వచ్చే సంచికలో పంచాయతీ ఎన్నికల్లో లోక్‌సత్తా పార్టీ బలపరిచిన అభ్యర్థులుగా పోటీ చేసిన వారి వివరాలు, విజయాలు సాధించిన వారి వివరాలను ప్రచురిస్తాం.

# దళితులు : చిల్లర వ్యాపారంలో విదేశీ పెట్టుబడులు

- చంద్రభాన్ ప్రసాద్

కొన్ని నెలల కిందట యు.పి.ఎ. ప్రభుత్వ చిల్లర వ్యాపారంలో విదేశీ పెట్టుబడులకు (FDI) అడ్డంకులను తొలగించింది. ఇది వారికి రాజకీయంగా కొంత ప్రమాద భరితమైందే. అయినా ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ ఇలాంటి సాహసానికి పూనుకోగానే ఇటు వామపక్షాలు అటు బి.జె.పి.లు తీవ్రమైన అభ్యంతరాలను లేవనెత్తాయి. చిల్లర వ్యాపారంలో విదేశీ పెట్టుబడుల వల్ల చిన్నతరహా దేశీయ కిరాణాషాపులు నష్టపోతాయన్న భావన ఉంది. అయితే ఈ ఎఫ్.డి.ఐ.ల ప్రభావం దేశంలో కొత్తగా పుట్టుకొస్తున్న దళిత వ్యాపారవేత్తల మీద చూపే ప్రభావాన్ని ఏ ఒక్కరూ ప్రస్తావించడం లేదు. ఎఫ్.డి.ఐ.ల మీద చర్చ తీవ్రతరం అవుతున్న సమయంలోనే “దళిత ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ” (DICCI) కి చెందిన సభ్యులు ఢిల్లీలో అజాద్‌పూర్‌లో వున్న పండ్లు, కూరగాయల మండీకి (హోల్‌సేల్ వ్యాపార కేంద్రం) వెళ్లి కమీషన్ ఏజంట్లుగా, మధ్య దళారీలుగా దళితులు ఎవరైనా వున్నారా అని గాలించారు.

ఈ మండీలలో “అధాతీయులు” (కమీషన్ ఏజంట్లు, దళారులు) ఆధిపత్యం చెలాయిస్తారు. వీరే ఆహారధాన్యాల వ్యాపారాన్ని, పండ్లు, కూరగాయల వ్యాపారాన్ని నియంత్రిస్తారు. వ్యవసాయ క్షేత్రం నుండి కిరాణాకొట్టు వరకు సాగే వ్యాపారాన్ని శాసిస్తారు. మనం తినే ప్రతి యాపిల్‌పండు, మనం పిండిగా వినియోగించే ప్రతి గింజ, మనం తినే టమాటాలు అన్నీ ఈ మధ్య దళారుల చేతుల మీదుగా రావలసిందే. ఈ మండీ పరిషత్ నిబంధన ప్రకారం రైతులు తమ సరుకులను ఈ మండీలలోని కమీషన్ కొట్లకు విధిగా తీసుకురావాలి. రైతులు సిమ్లా నుండి ట్రక్కులతో యాపిల్స్ తెచ్చినా, మీరట్ నుండి కూరగాయలు తెచ్చినా అంతా ఇక్కడికి రావలసిందే. రైతులు తమకు నచ్చిన వారికి అమ్ముకునే అవకాశం వుండదు. ఎవరో ఒక దళారి లేకుండా ఈ సరుకులు అమ్ముడుకావు.

ఇంతేకాదు. ఇక్కడ సరుకులు కొనుక్కునే వ్యాపారులు (వీరిని లోడర్స్ అంటారు) కూడా ఈ మండీల దళారుల నియమాలను పాటించి తీరాల్సిందే. రైతుల నుండి నేరుగా కొనుగోలు మాట అలా వుంచి కనీసం వారితో మాట్లాడటానికి కూడా అవకాశం లేకుండా చేస్తారు. ఈ మండీలలో అత్యధిక అధాతీయులు సర్వసాధారణంగా అగ్రకులానికి చెందిన వారుగా ఒక ప్రత్యేక ఉపకులంగా వుంటారు.

వ్యవహారరీత్యా వారు భారతదేశంలో మొత్తం హోల్‌సేల్ వ్యాపారాన్ని నియంత్రించ గల పరస్పర ఆధార గ్రూపుగా వుంటారు. మరోరకంగా చెప్పాలంటే వీరు తమంతట తాముగా ఏర్పడిన ప్రత్యేక తెగ.

అజాద్‌పూర్ మార్ట్‌లో సరుకు రవాణాదారులుగా, పండ్ల ఎగుమతిదారులుగా, కాంట్రాక్టర్లుగా కొందరు దళితులు జయప్రదంగా నిలదొక్కుకున్నారు. ఇలాంటి రంగాలలో దళిత వ్యాపారుల టర్నోవర్ కోట్ల రూపాయలలో వుంది. కాని ఒక్క దళితుడు కూడా ఈ మండీలో “అధాతీయుడు” కాలేదు. ఎందుకంటే మండీ వ్యవస్థ పునాదులు మధ్యయుగాల కాలానికి చెందినవి. దీనికి భిన్నమైంది దలాల్ స్ట్రీట్. ఇది ఆధునిక కాలానికి కంప్యూటర్ యుగానికి చెందింది. అందుకే మధ్యయుగాలనాటి కాలం చెల్లిన మండీ వ్యవస్థ ఆధునిక రిటైల్ వ్యవస్థను చూసి భయపడుతున్నది.

వ్యాపార సంస్థలలో దళితులు అన్న అంశంపై పెన్సిల్వేనియా యూనివర్శిటీలో దేవేష్‌కపూర్ ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ స్టడీ ఆఫ్ ఇండియా (CASI) తన అధ్యయనం కోసం చేసిన సర్వేలో దళితులలో అత్యధికులు 1991లో భారతదేశంలో ఆర్థిక సరళీకరణ ప్రక్రియ ప్రారంభమైన తర్వాత మొదటిసారి వ్యాపార రంగంలో ప్రవేశించిన వారుగా వున్నారని తేలింది. DICCI లో దేశవ్యాపితంగా 3000 మంది దళిత పారిశ్రామిక వేత్తలు సభ్యులుగా వున్నారు. వీరిలో అత్యధికులు కులవ్యవస్థ ప్రాతిపదికలు లేని వ్యాపార రంగాలలోనే వున్నారు.

కొత్త వృత్తులలో, కులప్రాతిపదికలు లేని రంగాలలో అత్యధికంగా దళితులు ప్రవేశించి విజయాలు సాధిస్తున్నారనేది CASI అధ్యయనం, DICCI అనుభవం తెలియజేస్తున్నాయి. అలాగే వివిధ దళిత పారిశ్రామిక వేత్తలు, హెవీడ్యూటీ క్రేన్స్

తయారీ, టన్నెళ్లు, బ్రిడ్జిల నిర్మాణం, యంత్రాల తయారీ రంగాలలో వున్నారని ఈ నివేదికలు పేర్కొన్నాయి. చిల్లర వ్యాపార రంగంలో ఘన విజయాలు సాధించిన దాఖలాలు ఇంతవరకు లేవు. DICCI కూడా చిల్లర వ్యాపార రంగంలో (ఉత్పత్తి నిర్మాణ రంగాలలో కాకుండా) ఒక మల్టీ మిలియనీర్‌ను ఇంకా కనుగొనాల్సి వుంది.

ఎందువల్ల అత్యధిక దళిత పారిశ్రామికవేత్తలు 1991 తర్వాతనే వచ్చారు, అంతకుముందు ఎందుకు రాలేదు? CASI పరిశోధకులు ఈ పరిణామంపై అంతకుముందు తెలియని ఒక కొత్త కారణాన్ని ఆవిష్కరించారు. 1991 సరళీకరణ తర్వాత భారతీయ వ్యాపారులు అంతర్జాతీయంగా పోటీ పడాల్సి వచ్చింది. పోటీతత్వం అనేది ధరల సూచీతో ప్రారంభం అవుతుంది. ఒక వస్తువును ఒకే గొడుగు కింద సంప్రదాయ పద్ధతిలో ఉత్పత్తి చెయ్యడం లేదా అమ్మడం అనే పద్ధతి అంతరించి వివిధ విభాగాలుగా ఇతరులతో పనిచేయించుకునే పద్ధతి (Out Sourcing) రూపుదిద్దుకుంటుంది. ఈ పని విభజనతో దళితులతో సహా లక్షలాది మంది కొత్త పారిశ్రామిక వేత్తలకి అవకాశాలు వచ్చాయి. వ్యాపార రంగంలో దళితుల ఆవిర్భావానికి ఇది తెర తీసింది.

దళితులు సంప్రదాయ రంగాలలో విజయులు కాలేరు. అలాగే స్థానికంగానే పరిమితమైన వ్యవస్థలలోనూ విజయులు కాలేరు. ఎందుకంటే కులం అనేది సంప్రదాయ సిద్ధమైంది, స్థానిక స్వభావం కలది. మండీ వ్యవస్థ ఈ రెండింటి సమ్మేళనం. అది సంప్రదాయబద్ధమైంది, స్థానికతత్వం గలది. చిల్లర వ్యాపారంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులతో విదేశీ ఆటగాళ్లతో చిల్లర వ్యాపారంలో కొత్త వ్యవస్థల ఆవిష్కరణ జరుగుతుంది. ఈ కొత్త వ్యవస్థలు కొత్తవారికి అవకాశాలు కల్పిస్తాయి. ప్రాచీన గురుకులాల ద్వారాల దగ్గర మనురుషి ఉన్నంతకాలం సంప్రదాయం వారికి ఆయుధం అయింది. గురుకులాలలో దళితులు ప్రవేశం నిషేధించబడింది. గురుకులాలకు బదులు సరికొత్త మందుగుండుతో అందరికీ అవకాశాలిచ్చే యూనివర్శిటీలు వచ్చాయి. మండీల వ్యవస్థ స్వభావరీత్యా గురుకులం వంటిది. ఎఫ్.డి.ఐ. భారతదేశంలో పారిశ్రామికీకరణకు మరింత ఊపునిస్తుంది. ఆధునికతను మరింత పెంచుతుంది. అందుకే ఎఫ్.డి.ఐ.లను తెండి, మనువును సాగనంపండి.

ఆధునికతను తెచ్చే ఉపకరణాలు దేశ పురోభివృద్ధిని త్వరితం చేస్తాయి. ఎఫ్.డి.ఐ. అలాంటి ఒక ఉపకరణం. ఇది భారతదేశపు చిల్లర వ్యాపార కథను తిరగరాస్తుంది. భారత ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాలలో వ్యాపారం అనేది ఇంకా సంప్రదాయ రీతిలోనే వుంది. చిల్లర వ్యాపారం ప్రత్యేకించి ఇంకా పురాతన పద్ధతుల్లోనే వుండిపోయింది. పైగా ఈ వ్యాపారులే వడ్డీ వ్యాపారులుగా కూడా వుంటున్నారు. సంప్రదాయ వ్యాపారులు సాగించే ఇలాంటి సమాంతర బ్యాంకింగ్ వ్యవస్థ దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తుంది, కొత్త ఆటగాళ్ల ప్రవేశాన్ని నిరుత్సాహపరుస్తుంది, అంతకుమించి ద్రవ్య చలామణీని అడ్డుకుంటుంది.

ఎఫ్.డి.ఐ.తో అనుసంధానించిన చిల్లర వ్యాపారం అనేక ఉద్యోగావకాశాలు కల్పిస్తుంది. వేలాదిమంది ఆహార రంగ నిపుణులు (Food Technologists), యం.బి.ఎ.లు, సి.ఎ.లకు పెద్ద డిమాండ్ వస్తుంది. రిఫ్రిజిరేటెడ్ వాహనాలు, రిఫ్రిజిరేటర్ల తయారీలో ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. మండీ వ్యవస్థ స్థానంలో మాంసం, చేపలు, కోళ్లు, గుడ్లు, కూరగాయలు, పండ్లు, ఆహారధాన్యాల రంగాలలో కొత్త తరహా సరఫరాదారులు వస్తారు. ఈ కొత్త ఆటగాళ్లలో దళితులు కూడా వుండే అవకాశాలుంటాయి.

భారతదేశం మారిపోతున్నది. కొన్నాళ్ల క్రితం ఇది ఒక వలస దేశం. స్వతంత్ర్యం వచ్చాక వెనుకబడిన దేశం అన్న పేరు తగిలించుకుంది. హరిత విప్లవం తర్వాత అభివృద్ధి చెందుతున్న దేశంగా పేరు తెచ్చుకుంది. ఈ హరిత విప్లవం కూడా ఒక ఎఫ్.డి.ఐ. లాంటిదే. నార్మన్ బొర్‌లాగ్, ఆయన వెంట వందలాది మంది విదేశీ వ్యవసాయ నిపుణులు భారతదేశాన్ని ఆహార సమృద్ధి గల దేశంగా మార్చారు. 1990 తర్వాత భారతదేశాన్ని పరివర్తన చెందుతున్న దేశంగా పిలుస్తున్నారు. భారతదేశం ఇప్పుడు అభివృద్ధి చెందుతున్న దేశం అన్న పేరు పొందాలి. అందుకు ప్రయత్నించాలి.

అయితే ఒక పురాతన వ్యాపార వ్యవస్థను అలాగే అంటిపెట్టుకుని భారతదేశం ఎప్పటికైనా అభివృద్ధి చెందిన దేశం కాగలదా? అనుమానాలు, శంకలతో భారతీయ చిల్లర వ్యాపార రంగం ఏమి సాధించగలుగుతుంది? ఆధునిక చిల్లర వ్యాపారంలోకి అడుగు పెట్టకముందు ఇప్పటి అభివృద్ధి చెందిన దేశాలలో కూడా మండీల తరహా నియంత్రణలు గల వ్యాపార వ్యవస్థలే వున్నాయి. ఈ విశ్వజనీన సూత్రానికి భిన్నంగా భారతదేశానికి మినహాయింపు ఎలా వుంటుంది? ■

# రాజ్యాంగం మార్పులకు సృజనాత్మక ఒత్తిడే మార్గం

- డా॥ జయప్రకాష్ నారాయణ్

ఎన్నికలలో నేరచరితులను నిరోధించే దిశగా 2013 జులైలో సుప్రీంకోర్టు కొన్ని తీర్పులనిచ్చింది. కులం పేరుతో ప్రదర్శనలను నిలువరిస్తూ అలహాబాద్ హైకోర్టు కూడా ఒక తీర్పునిచ్చింది. వీటి మీద సోషలిస్టు భావాలు కలిగిన పార్టీలతో సహా దాదాపు అన్ని రాజకీయ పక్షాలూ రకరకాల అభ్యంతరాలు చెప్పాయి. ఈ తీర్పులు శాసనవ్యవస్థలో న్యాయస్థానాల అనుచిత జోక్యమన్నట్టు మాట్లాడాయి. అయ్యా, ఈ తీర్పులో సుప్రీంకోర్టు ఏమీ కొత్తగా చెప్పలేదు, రాజ్యాంగంలోని అంశాల్నే స్పష్టంగా నిర్వచించింది, సామాన్య పౌరురాలు/పౌరుడైనా, చట్టసభ సభ్యుడైనా చట్టం ముందు సమానమే అని పునరుద్ఘాటించింది, ఆ తీర్పుకి అభ్యంతరం చెబుతూ చర్చను పక్కదోవపట్టించకుండా రాజకీయాలలో నేరచరితులను నిరోధించటం మీద దృష్టి పెట్టాలి అని చెబుతున్నా రాజకీయ పార్టీల చెవికెక్కటం లేదు. రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం ఏర్పాటైన రాజకీయ పార్టీలు, రాజ్యాంగం ప్రకారం, రాజ్యాంగం మీద ప్రమాణం చేసి ఎన్నికైన చట్టసభ సభ్యులే నిస్సంకోచంగా, నిర్లజ్జగా రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తుంటే వారిని గట్టిగా అడ్డుకునే సామాజిక పరిస్థితులు మనకు లేవు. మన వైఫల్యాలకు మూలం ఇక్కడే ఉంది. రాజ్యాంగం నీడలోనే అన్నీ పొందుతూ అదే రాజ్యాంగాన్ని అపహాస్యం చేసే సంస్కృతిని సరిచేయనంత వరకూ మనం భారతదేశ నిర్మాణాన్ని చేయలేం. అందుకే మనదేశంలో ఇంటింటా మాత్రమే కాదు విద్యాలయాల్లోనూ, కార్యాలయాల్లోనూ ఇలా ప్రతిచోటా ఉండాల్సిన పుస్తకం భారత రాజ్యాంగం అని చెబుతాను.



భారత రాజ్యాంగమంటే అహింసాయుత నక్సలిజం అని చెప్పవచ్చు. పుట్టుకతో వివక్షలేకుండా ప్రతి బిడ్డా ఎదిగేందుకు కావలసిన అవకాశాల్ని మన రాజ్యాంగం కల్పిస్తుంది. రాజ్యవ్యవస్థ స్వభావాన్ని మార్చి రాజ్యరహిత స్థాయి ఉదాత్త స్వభావం కలిగిన నూతన వ్యవస్థగా మార్చేందుకు కావలసిన అంశాలన్నీ మన రాజ్యాంగంలో ఉన్నాయి. అయితే ఎంతో వైవిధ్యం కలిగిన మన సమాజం తాత్కాలికంగా రాజ్యాంగం కంటే బలంగా ఉంటూ తన ధోరణిలో తాను సాగిపోతుంటే, హింస తలెత్తుతోంది. విధ్వంసం జరుగుతోంది. రాజ్యాంగాన్ని, సమాజాన్ని అనుసంధానం చేయాల్సిన రాజకీయం అధ్వాన్నంగా తయారవటం వల్ల రాజ్యాంగాన్ని నిత్యజీవిత దిక్సూచిగా ఎవరూ భావించటంలేదు.

రాజ్యాంగబద్ధ వ్యవహారశైలి అసాధ్యమనే రీతిలో మన రాజకీయ వ్యవస్థ తయారవటానికి బీజం రాజ్యాంగం రాసిన తొలినాళ్లలోనే పడింది. భారత రాజ్యాంగాన్ని తయారుచేసినప్పుడు పలు సంస్థానాలను విలీనం చేయటం వల్ల జాతీయ సమగ్రత కోణంలో కేంద్రీకృత పాలనావ్యవస్థను ఏర్పాటు చేశారు. గాంధీ గ్రామస్వరాజ్యాన్ని ప్రతిపాదించినా గ్రామాలలో వేళ్లూనుకుని ఉన్న కులవివక్ష దృష్ట్యా డా॥ అంబేద్కర్‌లాంటి వారు కూడా వికేంద్రీకరణను వ్యతిరేకించారు. అప్పటి పరిస్థితులలో కేంద్రీకృత పాలన భావనకు కొంత అర్థవంతమైన పునాది ఉండుండొచ్చు. కానీ ఆ అధికార కేంద్రీకరణనే అడ్డం పెట్టుకుని మన రాజకీయ వ్యవస్థ దేశాన్ని దోచేస్తుందని, రాజకీయాల్ని వ్యాపారంగా, పార్టీల్ని సొంత ఎస్టేట్‌లుగా మార్చుకుని కొంతమంది వ్యక్తులు పెత్తనం చెలాయిస్తారని రాజ్యాంగ నిర్మాతలు ఊహించలేకపోయారు. ముందుచూపుతో తగిన విరుగుడు ఏర్పాట్లను చేయలేకపోయారు.

ఎట్టకేలకు స్థానిక పాలనకు కొంత స్వతంత్ర ప్రతిపత్తి కల్పించేలా 73, 74 రాజ్యాంగ సవరణల్ని 1990లలో చేశారు.

అందులో అమెరికా రాజ్యాంగం కంటే కూడా ఎక్కువ పదాల్ని చేర్చారు. అవసరమైన వివరాల కంటే ఎక్కువే ఇచ్చి విధిగా స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని, విధుల్ని ఇవ్వాలన్న నిబంధన వద్దకు వచ్చేసరికి నీరుగార్చేశారు. స్థానిక సంస్థలు అనే మాట్లాడతారు తప్ప భారత ప్రభుత్వంలా, రాష్ట్ర ప్రభుత్వంలా, స్థానికంగా కూడా ప్రభుత్వాలు ఉంటాయన్న ఆలోచన కూడా ప్రజలకు రానీయకుండా చేస్తున్నారు.

అలాగే 2012లో వచ్చిన 97వ రాజ్యాంగ సవరణ గురించి కూడా ఇక్కడ గుర్తు చేసుకోవాలి. ప్రజలు స్వేచ్ఛగా సహకార సంఘాలను ఏర్పాటు చేసుకునే హక్కు ఉండాలనే భావనతో 1995లో 'మ్యాక్స్' (పరస్పర సహాయ సహకార సంఘాల) చట్టం తీసుకురావటంలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో కీలకపాత్రను పోషించిన నేను ఆ తర్వాత జాతీయ సలహామండలి సభ్యునిగా జాతీయ స్థాయిలో కూడా ఆ దిశగా కృషి చేశాను. ఆంధ్రప్రదేశ్‌లో మ్యాక్స్ చట్టం విజయాన్ని గుర్తించిన యూపీయే ప్రభుత్వం తన మేనిఫెస్టోలో ఆ తరహా చట్టాన్ని జాతీయస్థాయిలో కూడా తెస్తాననే హామీని పొందుపరిచింది. దాన్నే అవకాశంగా తీసుకుని 97వ రాజ్యాంగ సవరణను నేను ప్రతిపాదనను రూపొందించాను.

పౌరులు సంఘాలుగా, ట్రేడ్‌యూనియన్లుగా ఏర్పడే అవకాశాన్ని కల్పిస్తూ రాజ్యాంగం 19 (1-సి) అధికరణంలో కల్పించిన హక్కును విస్తరిస్తూ సహకార సంఘవ్యవస్థగా కూడా ఏర్పడే అవకాశాన్ని చేరుస్తూ 97వ రాజ్యాంగ సవరణ తేవాలని సూచించాను. దానికి ఆమోదం తెలుపుతూనే, కొంత మూర్ఖత్వం, కొంత సాంప్రదాయ రాజకీయ ధోరణి, కొంత అవగాహనారాహిత్యంతో ఒక పేరాగ్రాఫ్‌ని కూడా ఆ సవరణలో భాగంగా చేర్చారు. దాంతో 73, 74వ రాజ్యాంగ సవరణలలోలాగా కొంత గందరగోళం, అవాంఛనీయ పదాలు ఆ సవరణలో వచ్చి చేరాయి. ఉదాహరణకు, కేంద్రం (కేంద్ర ప్రభుత్వం) అనే పదాన్ని వాడారు. అలాంటి పదమే రాజ్యాంగంలో ఉండదు. యూనియన్ గవర్నమెంట్ అనే పదమే ఉంటుంది. అలాగే చట్టం పరిధిలో రాజ్యాంగం ఉంటుందనే భావనను కల్పించే వాక్యాలు రాశారు. 97వ రాజ్యాంగ సవరణలోని పార్ట్ 9 (బి)ని అనవసరంగా జోడించటం వల్ల చివరికి రాష్ట్రాల హక్కులలోకి కేంద్ర జరబడిందనే కారణంగా సహకార సంస్థలకు నేరుగా సంక్రమించే హక్కులకు గండికొట్టే పరిస్థితి ఏర్పడింది. లోక్‌సత్తాతోపాటు కొన్ని సంస్థలు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించి పార్ట్ 9 (బి)ని కొట్టివేసేలా చేయటంతో మన రాష్ట్రంలో సహకార సంఘాల స్వయంప్రతిపత్తికి తిరిగి భరోసా లభించింది.

**హింస ద్వారా వచ్చే మార్పు హింసకే దారితీస్తుందనటానికి మన ముందు లెక్కలేనన్ని సాక్ష్యాలున్నాయి. రాజ్యాంగమార్గంలో శాంతియుతంగా జీవిస్తూ మార్పుల కోసం 'సృజనాత్మక ఒత్తిడి' (క్రియేటివ్ టెన్షన్) పంథాలో పోరాడటమే సరైన మార్గం. భారతీయులమైన మేం... అంటూ ప్రజలే రాసుకున్న రాజ్యాంగం మనది. రాజ్యాంగపీఠికలోని అంశాలు అత్యంత ఉదాత్తమైనవి, కాలాతీతమైనవి.**

రాజ్యాంగం పట్ల ఈ నేర నిర్లక్ష్యాన్ని, ధిక్కారాన్ని మార్చుకుంటేనే మనం కోల్పోయిన రిపబ్లిక్‌ని సాధించుకోగలం.

హింస ద్వారా వచ్చే మార్పు హింసకే దారి తీస్తుందనటానికి మన ముందు లెక్కలేనన్ని సాక్ష్యాలున్నాయి. రాజ్యాంగమార్గంలో శాంతియుతంగా జీవిస్తూ మార్పుల కోసం 'సృజనాత్మక ఒత్తిడి' (క్రియేటివ్ టెన్షన్) పంథాలో పోరాడటమే సరైన మార్గం. భారతీయులమైన మేం... అంటూ ప్రజలే రాసుకున్న రాజ్యాంగం మనది. రాజ్యాంగపీఠికలోని అంశాలు అత్యంత ఉదాత్తమైనవి, కాలాతీతమైనవి. ఇక మిగిలిన రాజ్యాంగంలో మార్పులేవైనా కావాలంటే నిరభ్యంతరంగా చేసుకోవచ్చు. మొత్తం తిరగరాసుకున్నా అభ్యంతరం అక్కర్లేదు. కానీ అది కూడా రాజ్యాంగబద్ధంగానే జరగాలి. కొత్త నిబంధనలు వచ్చేంతవరకూ పాత రాజ్యాంగపద్ధతులను ఆమోదించితీరాల్సిందే. ఇదే పౌరసత్వం, ఇదే నాయకత్వం. మనకు పౌరసత్వ భావన ఇంకా వేళ్లూనుకోకపోవటం వల్లే అరటికాయ తొక్కమీద కాలువేసి జారిపడగానే, లేదా అవినీతో, మరో సమస్యో కనిపించగానే విచక్షణారహితంగా ఎవరో నియంతలు రావాలని, నక్సలైట్లు వచ్చి ప్రభుత్వంలోని వారిని కాల్చిచంపాలని ఆగ్రహావేశాలు వ్యక్తంచేస్తుంటాం. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయటాన్ని తప్పుగా భావించం. ఓటుతో ప్రభుత్వాల్ని శాంతియుతంగా

మార్చుకునే అవకాశం ఉందన్న స్పృహను కూడా తరచూ కోల్పోతుంటాం. పౌరసత్వాన్ని, నాయకత్వాన్ని పెంపొందించుకునేలా మనం సమాజాన్ని మార్చుకుంటే తప్ప రాజకీయాన్ని సంస్కరించుకుంటే తప్ప రాజ్యాంగబద్ధ పాలనను సాధించుకోలేం.

నేతలు అవినీతిపరులై పోయారు, ఎవరు తినలేదు గనక అని ప్రజలు కూడా తమకు తాత్కాలిక తాయిలాలిచ్చే అవినీతిపరులకే ఓటు వేస్తున్నారు, ఇటువంటి పరిస్థితులలో మనం రాజ్యాంగబద్ధ పాలనను, విలువల్ని సాధించటం సాధ్యమా అని నిరాశ చెందాల్సిన పన్లేదు. మనలో సానుకూల దృక్పథం ఉండాలేగానీ, వ్యవస్థీకృత మార్పులకి కావలసిన మార్గాలు కూడా మన ముందున్నాయి.

ఉదాహరణకి, ఒక్క ఓటు ఎక్కువ వస్తే గెలిచినట్టే, తక్కువ వచ్చినా ఓడినట్టే అనే ప్రస్తుత ఎఫ్.పి.టి.పి (ఫస్ట్–పాస్ట్–ది–పోస్ట్) ఎన్నికల వ్యవస్థ వల్ల ఓటుకు కోటి ఖర్చుపెట్టే పరిస్థితి దాపురించింది. పరిణతి చెందిన బ్రిటన్ వంటి ప్రజాస్వామిక దేశాలలో ఈ ఎన్నికల పద్ధతి మంచి ఫలితాలనే ఇస్తున్నా, నిరక్షరాస్యత, పేదరికం ఎక్కువ ఉన్న మనదేశంలో అంతగా ఫలితాలనివ్వటం లేదు. మంచిపార్టీకి వేసే ఓటు వృథా అనే భావన పెరిగిపోవటం వల్ల నిజాయతీపరులు, సమర్థులు రాజకీయాలకు దూరం అవుతున్నారు. రాజకీయాలలోకి వారసత్వంగా వచ్చే వారి సంఖ్య పెరిగిపోతూ వారు రాజకీయాన్ని ఓ వ్యాపారంగా భావించి డబ్బు వెదజల్లి గెలవటం, గెలిచాక అంతకు కొన్ని రెట్లు దోచుకోవటం ఆనవాయితీగా మారిపోయింది. ఇలాంటి నేతలు కేవలం అధికారం కోసమే రాజ్యాంగాన్ని అడ్డంపెట్టుకుని ఆ తర్వాత రాజ్యాంగాన్ని చిత్తుకాగితం కింద కాలరాసేస్తున్నారు. కాబట్టి, అన్ని వర్గాలకూ, అందరి ఓటుకూ విలువ దక్కేలా దామాషా ఎన్నికల వ్యవస్థను భారతదేశ పరిస్థితులకనుగుణంగా తీసుకొస్తే మన రాజకీయాలలో మేలిమి మార్పు వస్తుంది. డబ్బు, కండబలంతో పనిలేకుండా నిజాయతీపరులు తిరిగి తేలిగ్గా రాజకీయాలలోకి వచ్చే అవకాశం ఏర్పడుతుంది. రాజ్యాంగబద్ధ పాలనకు అవకాశం ఏర్పడుతుంది. దామాషా ఎన్నికల పద్ధతికి ఇప్పుడున్న రాజ్యాంగంలోనే తగిన ఏర్పాటు కూడా ఉంది. భిన్నధృవాలుగా ఉండే గాంధీని, అంబేద్కర్‌ని కలిపి కులవివక్ష లేని గ్రామస్వరాజ్యాన్ని సాధించటం ఈవేళ మనముందున్న కర్తవ్యం.

మీకు వ్యక్తిగతంగా ఉజ్వల భవిష్యత్తు కావాలన్నా, ఈ దేశంలో వివక్ష తొలగి అందరికీ ఎదిగే అవకాశాలు లభించాలన్నా, రాజ్యాంగబద్ధ జీవితం, రాజ్యాంగబద్ధ పోరాటం తప్ప వేరే సరైన మార్గం లేదు. 18వ శతాబ్దంలో వచ్చిన ఫ్రెంచి విప్లవం ఎన్నో విప్లవాలకు, పోరాటాలకు మాతృకగా నిలిచింది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం భావాలను ప్రపంచమంతా వెదజల్లిందా విప్లవం. గణతంత్ర భావనకు ఊపిరిలూదింది. అయితే అంతటి విప్లవమూ చివరికి నియంతృత్వానికి దారితీసి విఫలమైంది. భారత రాజ్యాంగంలాంటి దిక్సూచి ఆ సమయంలో ఫ్రాన్స్‌లో ఉండివుంటే, ఈవేళ ప్రపంచం తీరుతెన్నులు మరోలా ఉండుండేవని ఆలోచనాపరులు చెబుతుంటారు.

శివరాజం బొట్ల చాలా తేలిగ్గా అర్థమయ్యేలా, గుర్తుంచుకునేలా భారత రాజ్యాంగాన్ని అందించేందుకు ప్రశంసనీయ ప్రయత్నం చేశారు. రాజ్యాంగాన్ని బైబిల్‌లా, భగవద్గీతలా, ఖురాన్‌లా ఎప్పుడూ దగ్గరే ఉంచుకునే ఒక పౌరునిగా, ఉద్యమకారునిగా, రాజకీయవేత్తగా నేను మీకు చెప్పే దొక్కటే– ఈ పుస్తకాన్ని గుండె లోతుల్లో నుంచి చదవండి. ప్రతి వివరాన్నీ ఉత్సుకతతో అర్థం చేసుకుంటూ ఆర్తితో చదవండి. సివిల్స్ సహా అన్ని పరీక్షలలో అవలీలగా, ఆత్మవిశ్వాసంతో రాయగలుగుతారు. అంతకుమించి పౌరసత్వాన్ని, నాయకత్వాన్ని పెంపొందించుకోగలుగుతారు. వ్యక్తిగతంగానే కాక, సామాజికంగా ఏ సమస్య వచ్చినా తేలిగ్గా పరిష్కరించుకోగలుగుతారు, పరిష్కరించే మార్గాన్ని చూపగలుగుతారు. పౌరులుగా, ఉద్యోగులుగా, వ్యాపారులుగా, రాజకీయనేతలుగా ఈ దేశంలోని సమస్యలకు రాజ్యాంగబద్ధ సృజనాత్మక పరిష్కారాలను అందించేందుకు మీరు చేసే ప్రయత్నానికి మించిన పుణ్యకార్యం ఇంకోటి ఉండదు.

పోటీ పరీక్షలు రాసేవారికే కాకుండా, అసంఖ్యాక సాధారణ తెలుగు ప్రజలకు కూడా ఉపయోగపడేలా భారత రాజ్యాంగం పుస్తకాన్ని అందించిన శివరాజం బట్ల గారిని మనసారా అభినందిస్తూ...

('ఇండియన్ కాన్‌స్టిట్యూషన్' పుస్తకానికి డా॥ జయప్రకాష్ నారాయణ్ రాసిన ముందుమాట) ■

# వ్యక్తి స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమానత్వం వైపు పురోగమనం

- డాక్టర్ విజయం

గతకాలపు రాజకీయాలు ఈనాటి చరిత్రలో భాగం. ఈనాటి రాజకీయాలు నడుస్తున్న చరిత్ర. చరిత్రను అధ్యయనం చేసి మానవజాతి ఎప్పటికప్పుడు చరిత్ర నుండి గుణపాఠాలు నేర్చుకుంటూ, నిత్యనూతనంగా ముందుకు సాగుతుంది. ఈ విధంగా గతం–వర్తమానం–భవిష్యత్తు ఒక దానిపై మరొకటి ఆధారపడి వున్నాయి. అవి జాతిజీవన స్రవంతికి ప్రతీక. గతాన్ని మనం మార్చలేం. ఎందుకంటే అది చరిత్రలో భాగం. కాని, ఆ చరిత్రను విశ్లేషించి, ఎప్పటికప్పుడు నిత్యనూతనంగా ఎదిగితే గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా వుంటాయి. ఈ విధంగా చరిత్ర పునాదిగా వర్తమానంలో మనం భవిష్యత్తుకు రూపకల్పన చేసుకోవచ్చు. ఉజ్జ్వల భవిష్యత్తును సాధించవచ్చు.

వేలాది సంవత్సరాలుగా మతం, రాజరికం ప్రపంచవ్యాప్తంగా తమ అధిపత్యాన్ని కొనసాగించాయి. వ్యక్తి స్వేచ్ఛకు, వ్యక్తి ఆలోచనకు స్థానం లేదు. "My word is law" అని రాజులు, చక్రవర్తులు సామాన్య ప్రజలపై పెత్తనం చేశారు. మతనాయకులు–రాజులు కలిసి ప్రజలను కాలరాశారు. యూరపుల మధ్యయుగాల చరిత్రను చూస్తే మతం, మతనాయకులు జీవితంలో అన్ని రంగాలపై కారుమబ్బులాగా క్రమ్ముకొని వుండి, మనిషి వ్యక్తిత్వ వికాసానికి, సైన్సు అభివృద్ధికి ఆటంకంగా రూపొందారు. తాము చెప్పిందే అందరూ అంగీకరించాలని, రాజు దైవాంశసంభూతుడని, రాజుని ధిక్కరిస్తే దైవద్రోహి అని దండించి వ్యక్తి స్వేచ్ఛను, ఆలోచించే శక్తిని కాలారాశారు. రాజులు–మతగురువులు కుమ్మక్కై ప్రజలను బాధలగాథలకు గురిచేశారు.

మధ్యయుగాలలో 400 సంవత్సరాలు మతయుద్ధాలు జరిగాయి. మతంలోనే వివిధ శాఖల మధ్య సంఘర్షణ కొనసాగింది. మహమ్మదీయులకు–క్రైస్తవులకు మధ్య మతయుద్ధాలైన Crusades కొనసాగాయి. లక్షలాదిమంది అమాయక ప్రజలు మతయుద్ధాలలో ఆహుతి అయిపోయారు. భూమి రక్తసిక్తమైంది. 15వ శతాబ్దంలో టర్కీలోని కాన్‌స్టాంటినోపుల్ పట్టణం, చివరికి మహమ్మదీయుల పశమై ఇస్తాంబుల్‌గా మారింది.

ఆధునిక యుగ ఆవిర్భావంతో మతాన్ని–రాజకీయాలను విడదీయాలని, రాజరికం పోయి ప్రజాస్వామికం కావాలన్న భావం బలపడింది. మధ్యయుగాల యూరపులో రాజు ఏ మతశాఖకు చెందితే, ప్రజలలో కూడా అదే మతశాఖ తీసుకోవాలని ఒత్తిడి చేసేవారు. ప్రజలకు వేరే అస్థిత్వం వుందని గాని, వారికి స్వతంత్ర అభిప్రాయాలు వుంటాయని గాని ఆ కాలంలో రాజులకు ఆలోచన లేదు. మతగురువులు పాపపరిహార పత్రాలు అమ్మడం, అందులో నిష్ణాతుడైన టెడ్జిల్ "ముందస్తు బెయిల్" "Anticipatory Bail" లాగా పాపం చెయ్యడానికి ముందుగానే రాజులు, రాజవంశీకులు పాపపరిహారపత్రాలు కొనుక్కోమని ప్రచారం చెయ్యడంతో మార్టిన్ లూథర్ రోమన్ కాథలిజంపై తిరగబడ్డాడు. అప్పుడప్పుడే జర్మన్ రాజులలో ప్రారంభమవుతున్న జాతీయతాభావాన్ని మార్టిన్ లూథర్ ఉపయోగించుకొన్నాడు. ఈ విధంగా మత కబంధహస్తాల నుండి రాజులను, ప్రజలను విముక్తి చెయ్యడానికి మార్టిన్ లూథర్ ప్రొటెస్టాంటిజం కొంత తోడ్పడింది. కాని, మతం పేరుతో చాలా నిర్బంధాలు ప్రజలపై కొనసాగాయి. లేదా ఇతర మతశాఖకు చెందిన వారిని హింసించడం, వారికి ఆస్తిహక్కు, అభిప్రాయ ప్రకటనా స్వేచ్ఛ లేకుండా ఆ దేశపు రాజులు చేశారు. మతంలో విప్లవాలు, ప్రజల ఉద్యమాల ఫలితంగా రాజరికం నుండి ప్రజాస్వామికం, వ్యక్తి స్వేచ్ఛ, ఆస్తిహక్కు, జీవించడానికి స్వేచ్ఛ వంటి భావాలు బలం పుంజుకొన్నాయి.

1688లో ఇంగ్లండులో వచ్చిన "గ్లోరియస్ రెవల్యూషన్" ఇంగ్లండు రాజు పార్లమెంటుకు లోబడి వుండాలని, రాజు పార్లమెంటుపై పెత్తనం చేయడానికి వీలులేదని స్పష్టం చేసింది.

18వ శతాబ్దంలో ఇంగ్లండు వలస అయిన అమెరికా తిరగబడింది. తమకు ఇంగ్లండు పార్లమెంటులో ప్రాతినిధ్యం కల్పించకుండా, వలసలలో వున్న ప్రజలపై పన్ను వెయ్యరాదని అమెరికన్ ప్రజలు ఎదురుతిరిగారు. ఇదే "No Taxation without Representation" అన్న విప్లవ నినాదానికి, ప్రజలను సమైక్యపరిచి అమెరికా స్వాతంత్ర్యాన్ని సాధించుకోవడానికి అక్కడి ప్రజలను సమాయత్తపరచింది. జాతీయతాభావాన్ని దాటి

విశ్వనరుడనని, తనకి దేశాలతో నిమిత్తం లేదని, అమెరికా స్వాతంత్ర్యానికి థామస్ పెయిన్ పూనుకొన్నాడు. తాను వ్రాసిన "Common Sense", "Crisis" వంటివి విప్లవానికి మార్గదర్శకమయ్యాయి. ప్రజలు హేతుబద్ధంగా ఆలోచించాలని "Age of Reason" పుస్తకాన్ని వ్రాశాడు. మతం కాదు, మనిషి ముఖ్యం అని థామస్ పెయిన్ ఎలుగెత్తి చాటాడు.

విప్లవానంతరం అమెరికా ప్రపంచంలో మొట్టమొదటి లిఖిత రాజ్యాంగం రూపొందించుకొంది. మతాన్ని-రాజకీయాలను విడదీస్తూ, అమెరికా సెక్యులర్ స్టేట్‌గా అవతరించింది. ప్రజలపై మతాన్ని రుద్దే అవకాశం రాజ్యానికి లేదని, ప్రజలను వ్యక్తి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానత్వం జన్మసిద్ధ అధికారమని అమెరికన్ రాజ్యాంగం స్పష్టం చేసింది. అంతేకాదు, ఇంగ్లండులో లాగా రాజరిక పాలనకు అమెరికా స్థానం ఇవ్వలేదు. అమెరికా ఒక రిపబ్లిక్‌గా అవతరించింది. ప్రజల ప్రాథమిక హక్కుకు రాజ్యాంగంలో చట్టబద్ధ రక్షణ కల్పించారు. 18వ శతాబ్దంలో అమెరికా రాజ్యాంగం ప్రపంచ ప్రజలకు ఒక ఆశాజ్యోతిగా వెలుగొందింది. దాని ప్రభావం యూరపులో, అందులో ముఖ్యంగా ఫ్రాన్సుపై పడింది.

1776లో అమెరికన్ విప్లవం వస్తే, ఒక దశాబ్దంలోనే ఆ ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఫ్రాన్సులో ప్రజలు రాజరిక నియంతృత్వంపై తిరగబడ్డారు. "స్వేచ్ఛ, సమానత్వం, సహోదరత్వం" ఫ్రెంచి విప్లవ నినాదం అయింది. "My word is Law" అని లూయీ 14 ప్రకటించాడు. "నేను చెప్పేదే చట్టం, న్యాయం'' అని ప్రగల్భాలు పలికిన 14వ లూయీ ప్రజాకంటకుడైనాడు. అతను చనిపోతే ప్రజలు ఆనందంతో ఉత్సవాలు జరుపుకున్నారు. క్రొత్త రాజును కూలద్రోసి ఫ్రెంచి విప్లవం రాజరిక స్థానంలో ప్రజాస్వామిక రిపబ్లిక్‌గా ప్రకటించుకొంది. అయితే, ఫ్రెంచి విప్లవానికి నాయకత్వంలోపం వుండటం, అంతర్గత కుమ్ములాటలలో చివరికి అది అంతర్యుద్ధంగా మారి తిరిగి రాజరికం ఏర్పడింది. ఫ్రెంచి తత్వవేత్తలయిన వాల్టేర్, రూసో, డిడెరాట్, మాంటిస్క్యూ వంటి తత్వవేత్తలు ఫ్రెంచి విప్లవానికి నాందీ ప్రస్తావన చేసినా, నాయకత్వలోపం వలన ఫ్రెంచి విప్లవం విజయవంతం కాలేదు.

కాని, ఫ్రెంచి విప్లవం యూరపు అంతా స్వాతంత్ర్య జ్వాలను ప్రజ్వరిల్లజేసింది. రాజరికాలపై ప్రజలు తిరగబడ్డారు. 19వ శతాబ్ద పూర్వార్ధంలో యూరపులో ప్రజాస్వామ్య స్థాపన తమ దేశాలలో జరగాలని అలలు అలలుగా విప్లవాలు వచ్చాయి. రాజ్యాంగబద్ధ పాలన కావాలని ప్రజలు కోరారు. కొన్ని దేశాలలో ఆవేశమే గాని, ప్రజాస్వామ్యం పట్ల అవగాహన లేదు. అందుకే ఆస్ట్రియాలో 19వ శతాబ్దంలో "Ferdinand and Constitution" అని కోరి ఆందోళన జరిగితే ఫెర్డినండ్ రాజు కనుక, Constitution (రాజ్యాంగం) ఆయన భార్య అయి వుంటుందని ప్రజలు అనుకొన్నారు!

అయినా, 19వ శతాబ్దం చివరికి వచ్చేసరికి యూరపు దేశాలలో రాజులు నామమాత్రంగా మిగిలారు తప్ప, దేశాలలో నిజమైన అధికారం పార్లమెంటులకు సంక్రమించింది. ఇది విప్లవాత్మక పరిణామం. అంతేకాక, ప్రజలు రాజ్యాంగంలో తమ హక్కులను సంరక్షిస్తూ, ప్రాథమిక హక్కులకు డిమాండ్ చేశారు.

19వ శతాబ్దంలో ప్రజలలో స్వేచ్ఛ, స్వాతంత్ర్య భావాలను, ప్రజాస్వామిక చైతన్యాన్ని పెంచడంలో పత్రికలు, పుస్తకాలు గణనీయపాత్ర పోషించాయి.

అమెరికా, యూరపు దేశాలలో వస్తున్న పరిణామాల ప్రభావం వలస దేశాలలో కూడా పడడం ప్రారంభించింది. ఇంగ్లండు, ఫ్రాన్సు, జర్మనీ, అమెరికా వంటి దేశాలలో చదువుకోవడానికి వెళ్లిన వ్యక్తులు కొద్దిమంది అయినా, వారిలో తమ దేశాలకు కూడా స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాస్వామికం కావాలని, తమకు కూడా తమ తమ దేశాలలో పార్లమెంటు, అసెంబ్లీలో ప్రాతినిధ్యం వుండాలని, క్రమబద్ధంగా ఎన్నికలు జరగాలని, ప్రాథమిక హక్కులు పరిరక్షింపబడాలని, తమ దేశాలకు కూడా స్వాతంత్ర్యం కావాలని, తమ తమ వలస దేశాలకు తిరిగివచ్చి ఉద్యమాలు, ఆందోళనలు వారు ప్రారంభించారు. ఈ విధంగా సామ్రాజ్యవాద దేశాలపై ప్రజలు తిరగబడడం ప్రారంభించారు. మన దేశంలో మహాత్మాగాంధీ నాయకత్వాన జాతీయోద్యమం ఉధృతంగా కొనసాగింది. కేవలం స్వాతంత్ర్యం యిస్తే చాలదని, సంపూర్ణ స్వరాజ్యం కావాలని ప్రజలు కోరడం ప్రారంభమైై వలసవాదం (Colonialism) అంతం కావాలని, సామ్రాజ్యవాద దేశాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు ఉధృతంగా జరిగాయి. "స్వరాజ్యం నా జన్మహక్కు" అని లోకమాన్య తిలక్ హెచ్చరించాడు. కాంగ్రెసు 1929లో 'సంపూర్ణ స్వరాజ్యం' కావాలని తీర్మానించింది. విదేశీవస్త్ర దహనానికి, కోర్టుల బాయ్‌కాట్‌కి

పూనుకొంది. "క్విట్ ఇండియా" ఉద్యమం కొనసాగింది. ఎందరో వీరుల త్యాగఫలితంగా మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. అదేవిధంగా ప్రపంచవ్యాప్తంగా వలసపాలన అంతమై ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలలో ఎన్నో దేశాలు స్వాతంత్ర్యం పొందాయి. తమ తమ రాజ్యాంగాలు రూపొందించుకున్నాయి. రాజరికాలు అంతమై ప్రజాస్వామికదేశాలు ఆవిర్భవించాయి.

రాజకీయ స్వాతంత్ర్యం తక్కిన మార్పులకు నాందీ ప్రస్తావన చేస్తుంది. Freedom is a necessary pre condition for achieving other changes. రాజకీయ స్వాతంత్ర్యంతోపాటు సాంఘిక, ఆర్థిక సమానత్వం, విద్య-విజ్ఞానం వ్యాప్తి చెందాలి.

మరోప్రక్క 20వ శతాబ్దంలో సెక్యులరిజం ప్రాధాన్యతను వివిధ దేశాలు గుర్తించాయి. మతం వ్యక్తిగత విషయం కావాలని, మతాన్ని- రాజకీయాలను కలగాపులగం చేయరాదని కోరారు. ఒక్క మతాన్ని- రాజకీయాలను విడదీయడమేకాక, సెక్యులరిజం జీవితంలో అన్ని రంగాలనూ ప్రభావితం చేస్తూ ఒక జీవిత విధానంగా రూపొందవలసిన అవసరం వుంది. పాశ్చాత్యదేశాలలో మతం తన ప్రాబల్యాన్ని కోల్పోతూ వుంది. కాని, మన దేశంలో సెక్యులరిజాన్ని రాజ్యాంగంలో పొందుపరచడంతో సంతృప్తి చెందితే చాలదు. ఈనాడు రాజకీయాలపై మతం, కులం ప్రభావం ఎక్కువ అవుతోంది. Politicisation of Religion and Caste జరుగుతూ వుంది. కులం, మతం పట్టు సడలింది. మతం తన ప్రాభవాన్ని నిత్యజీవితంలో కోల్పోయింది. అలాంటి వాతావరణంలో రాజకీయ నాయకులు పనిగట్టుకొని, బుద్ధిపూర్వకంగా మతరాజకీయాలను, కులరాజకీయాలను ప్రోత్సహిస్తున్నారు. జాతీయోద్యమం ఒక సెక్యులర్ ఉద్యమంగా విశాల ప్రాతిపదికన జరిగింది. కాని, ఈనాడు మితవాద, మతవాద శక్తులు రాజకీయాలలోకి ప్రవేశించి, ప్రజల దృష్టిని నిత్యజీవిత సమస్యల పరిష్కారం వైపు కాకుండా, వారిని మతమౌఢ్యంలో, కులంకుళ్లులో వుంచాలని ప్రయత్నం జరుగుతూ వుంది. మతతత్వమే మహాత్మాగాంధీ దారుణహత్యకు దారితీసింది. ఈనాడు ఆ మతతత్వ శక్తులే, ప్రతీపశక్తులే రాజకీయాలలో పైచేయి సాధించాలని ప్రయత్నిస్తున్నాయి. ఈ రకమైన ప్రయత్నాల వలన జాతీయ సమైక్యతకు, సమగ్రతకు, ప్రగతికి అవరోధం ఏర్పడుతుంది. భిన్నమతాలు, సంస్కృతులు, భావాలు, కాలంచెల్లిన కులవ్యవస్థ వున్న మనదేశంలో మతాన్ని-కులాన్ని రాజకీయాలనుండి విడదీసి, సెక్యులరిజంని బలోపేతం చేయడం ఈనాడు అత్యవసరం.

ప్రజల చేతిలో అత్యంత శక్తివంతమైన ఆయుధం ఓటు. ఆ ఓటును ఎంతో జాగ్రత్తతో, బాధ్యతతో వేయవలసిన అవసరం వుంది. నోటుకో, నోటిమాటకో, మద్యానికో, కుల-మత తత్వాలకో లోబడి, సంకుచితంగా ఆలోచించి, విశాలత్వాన్ని కోల్పోయి, అనాలోచితంగా, ప్రజలు వ్యవహరించినట్లయితే, దేశానికి, భవిష్యత్తుకి నష్టం వాటిల్లుతుంది. ప్రజలకు కావలసింది బడులు, ఆస్పత్రులు, అన్నవస్త్రాలు, ప్రగతికి దోహదకారి చేసే విధానాలు. అంతేగాని మతమౌఢ్యం కాదు. మనదేశ భవిష్యత్తు, ప్రజల అభ్యున్నతి సెక్యులరిజంతో ముడిపడి వుందన్న విషయాన్ని పదే పదే ప్రజలకు తెలియజెప్పవలసిన అవసరం వుంది.

ఈనాడు రాజకీయ పార్టీలు ఎంతో బాధ్యతాయుతంగా వ్యవహరించవలసిన అవసరం వుంది. వాటికి నిర్మాణాత్మక దృక్పథం కావాలి. సైన్సు- శాస్త్రీయదృష్టిని, విద్యని-వికాసాన్ని పెంపొందించడం, తమ ఓటును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేయడం, ప్రలోభాలకు లోబడకుండా నిరంతరం జాగరూకతతో ప్రజలు ముందడుగు వేయవలసిన అవసరం ఎంతైనా వుంది.

ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యం భారతదేశం. భిన్న సంస్కృతులకు, భావాలకు ఆలవాలమైన ఈ దేశం సర్వతోముఖంగా అభివృద్ధి చెందాలంటే సమగ్రదృష్టి, సమానత్వ దృక్పథం అసవరం. ఆర్థిక సమానత్వం, విద్య, ఉద్యోగం ఈనాడు ప్రజలకు కావాలి. వాటిని సాధించడానికి నిర్మానాత్మకంగా ఏమి చెయ్యగలం అని ప్రతి ఒక్కరూ ఆలోచించాలి.

ప్రజాచైతన్యం, నిర్మాణాత్మక దృక్పథం, పట్టుదల, దీక్ష, ముందుచూపు, ప్రగతిపథంలో పురోగమనం మనదేశ ఉజ్వల భవిష్యత్తుకు అత్యవసరం. ■

**(2013 మే 12న విజయవాడలో లోక్‌సత్తాపార్టీ శిక్షణ శిబిరంలో నాస్తికకేంద్ర నిర్వాహకులు, సాంఘిక శాస్త్రవేత్త డాక్టర్ విజయం ప్రారంభోత్సవ ఉపన్యాస సారాంశం)**

# పేదరికంతో పరాచికం

- రాష్ట్రంలో పేదలు 9 శాతమే అంటున్న కేంద్రం
- 2018లోగా 12 శాతానికి తగ్గిస్తానంటున్న రాష్ట్రం
- పేదరికం పెరుగుతోందంటున్న ప్రపంచ బ్యాంకు
- పొంతన కుదరని లెక్కలు

రాష్ట్ర జనాభాలో ఇప్పుడు దారిద్ర్య రేఖ దిగువనున్న 9.20 శాతం మంది మాత్రమే ఉన్నారు. దివంగత ఆర్థికవేత్త తెండూల్కర్ సుత్రీకరణ ప్రకారం రాష్ట్రంలో రోజుకు గ్రామాల్లో రూ. 28, పట్టణాల్లో రూ. 33లోపు ఖర్చు పెట్టేవారు మాత్రమే పేదలుగా గుర్తింపు పొందుతారు. రాష్ట్రంలో ప్రస్తుతం 21 శాతంగా ఉన్న పేదలను 2017-18 నాటికి 12 శాతానికి తగ్గించాలనే లక్ష్యాన్ని పెట్టుకొన్న రాష్ట్ర సర్కారుకు తాజా గణంకాలు సహజంగానే విస్మయం కలిగించాయి. దీంతో ఇప్పుడు పేదలను 9 శాతం కంటే ఇంకా తగ్గించుకొనే కొత్త లక్ష్యాన్ని నిర్ధేశించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. జాతీయ నమూనా సర్వే సంస్థ (ఎన్ఎస్ఎస్ఓ) రాష్ట్రాల వారీగా సేకరించిన వివరాలకు తెండూల్కర్ సూత్రీకరణను అన్వయించినప్పుడు పేదల సంఖ్య బాగా తగ్గిపోయింది. 2009-10 ఎన్ఎస్ఎస్ఓ గణాంకాల ఆధారంగా లెక్కలు కట్టి గత ఏడాది పేదల వివరాలను వెల్లడించినప్పుడు దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వచ్చాయి. రోజువారీగా గ్రామాల్లో రూ. 26, పట్టణాల్లో రూ. 32లోపు ఖర్చుపెట్టే వ్యక్తిని మాత్రమే పేదవాడిగా గుర్తించే విధానంపై అన్ని వర్గాలు దుమ్మెత్తి పోయటంతో కొత్త సూత్రీకరణ కోసం కేంద్రం రంగరాజన్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ వచ్చే ఏడాది నివేదికను ఇవ్వాల్సి ఉండగా ప్రణాళిక సంఘం ఇంతలోనే మళ్లీ తెండూల్కర్ సూత్రీకరణ ప్రకారం పేదల సంఖ్యను తేల్చింది. గత ఏడాది లెక్కల ప్రకారం రాష్ట్రంలో పేదలు 21.1 శాతం మంది ఉన్నారు. విమర్శల నేపథ్యంలో కొత్త సూత్రీకరణతో అది ఇంకా పెరగవచ్చని అంతా భావించగా అందుకు భిన్నంగా పేదలు కేవలం 9.20 శాతమని తేలింది. అయితే, తెండూల్కర్ సూత్రీకరణ హేతుబద్ధమేనని రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. 2017-18 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రాష్ట్రంలో పేదల సంఖ్యను 12 శాతానికి తగ్గిస్తామని ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ఇటీవలే ప్రణాళిక సంఘానికి నివేదించారు. దేశంలో కేరళ, పంజాబ్ తర్వాత పేదలు అతి తక్కువగా మన రాష్ట్రంలోనే ఉన్నట్లు వెల్లడయ్యింది. దేశంలో అభివృద్ధితో పాటుగానే పేదలు కూడా బాగా పెరిగి పోతున్నారని, దేశ జనాభాకు అనుగుణంగా వృద్ధి రేటు లేదని ప్రపంచ బ్యాంకు ఇటీవల పేర్కొనగా తాజా లెక్కలు మాత్రం దాని అధ్యయానికి పూర్తి భిన్నంగా వున్నాయి. ■

| రాష్ట్రంలో పేదల శాతం ఇలా | |
|---|---|
| 1974 | 48.86 |
| 1978 | 39.31 |
| 1983 | 36.30 |
| 1988 | 25.86 |
| 1994 | 22.19 |
| 2005 | 29.90 |
| 2012 | 21.01 |
| 2013 | 9.20 |



# సమాజ హితమే రాజమౌళి అభిమతం

## సంతాప సభలో ప్రముఖుల నివాళి



సంతాప సభలో మాట్లాడుతున్న ఎంపీ పొన్నం ప్రభాకర్; శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్సీ సంతోష్‌కుమార్

సమాజ హితం కోసం లోక్‌సత్తా కార్యదర్శి రాజమౌళి చివరి వరకు ఉద్యమాలు చేశారని, ఆయన సూచించిన మార్గంలో అంతా పయనించాలని కరీంనగర్‌లో ఫిలింభవన్‌లో జరిగిన రాజమౌళి సంతాప సభలో పలువురు ప్రముఖులు సూచించారు. ఈ సంతాప సభలో కరీంనగర్ ఎంపీ పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. రాజమౌళి మరణం సమాజానికి తీరని లోటని అన్నారు. బీసీ కమీషన్ సభ్యుడు వకుల భరణం కృష్ణమోహన్‌రావు, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాజీ సమన్వయ కర్త డి.వి.వి.యస్.వర్మ మాట్లాడుతూ.. ఏటా రాజమౌళి పేరిట స్మారక ఉపన్యాస కార్యక్రమం ఏర్పాటు చేయాలని లోక్‌సత్తా సంస్థ ఉద్యమ నిర్మాత జయప్రకాష్ నారాయణ్ నిర్ణయించినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, సోమసుందర్, నరేష్, కొడూరి సత్యనారాయణ గౌడ్, ఫిల్మ్ సొసైటీ నుంచి ముజఫర్, వినియోగదారుల మండలి నుంచి నారాయణ, బాలవికాస సమితి భూపతిరెడ్డి, సాహితి గౌతమి కెవిఎస్ అనంతాచార్య, తెరవే జి.నాగభూషణం, సమైక్య సాహితి ఎమ్.గోపాల్, జన విజ్ఞాన వేదిక నుంచి రామరాజు, వెంకటేశ్వరరావు, రఘుశంకర్ డీటీఎఫ్, జి.లక్ష్మణ్‌రావు తితిదే ధర్మ ప్రచార మండలి సభ్యులు, కృపానందం, వెంకటేశ్వర్లు స.హ.చట్టం బాధ్యులు, కార్యదర్శి గంగాధర్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు చందూరి రాజిరెడ్డి, టీడీటీఎఫ్ అధ్యక్షులు రాజమల్లు, కనకయ్య, ఐఎమ్ఏ అధ్యక్షుడు బీఎన్‌రావు, ప్రధానోపాధ్యాయుల సంఘం నారాయణరెడ్డి, శ్రీనివాసరావు, శాంతిప్రకాష్ శుక్లా, ప్రభాకర్, రాంచంద్రరెడ్డి, చుక్కరెడ్డి, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

**రాజమౌళి మృతి వార్త తెలియగానే ఈ క్రింది ప్రముఖులు తమ సంతాపాన్ని ప్రకటించారు** – పదిహేనేళ్లుగా తనతో పాటు అవినీతి రహిత సమాజం కోసం పనిచేసిన రాజమౌళి మృతి తీరని లోటని అమెరికాలో ఉన్న లోక్‌సత్తా ఉద్యమ సంస్థ జిల్లా అధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్ పేర్కొన్నారు. డైరీ ఛైర్మన్ రాజేశ్వర్‌రావు, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ జిల్లా బాధ్యుడు కోల రాంచంద్రారెడ్డి, సాహితీ వేత్తలు దాస్యం సేనాధిపతి, కె.బి.శర్మ, రాధాకృష్ణ, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా కార్యదర్శి ప్రద్యుమ్నకుమార్, ఎ.కిరణ్‌కుమార్ సంతాపం ప్రకటించారు.

### జేపీ ప్రగాఢ సంతాపం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర కార్యదర్శి టి. రాజమౌళి (48 ) హఠాన్మరణం పట్ల నిజామాబాద్ పర్యటనలో ఉన్న లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. కరీంనగర్ జిల్లా కార్యదర్శిగా, అధ్యక్షునిగా జిల్లాలోని అన్ని మండలాలకూ లోక్‌సత్తా భావజాలాన్ని విస్తరింపచేశారని అన్నారు. అవినీతిని సాక్ష్యాధారాలతో బట్టబయలు చేయటం దగ్గర్నుంచి అనేక కీలక సమస్యలపై లోక్‌సత్తా భావజాలంతో పోరాడారని, మంచి ప్రజాఉద్యమాలను నిర్మించారని అన్నారు. రాజమౌళి కుటుంబసభ్యులకు జేపీ ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపాన్ని తెలియచేస్తూ వారికి లోక్‌సత్తా అన్నిరకాలుగా అండదండగా నిలుస్తుందని తెలిపారు.

గుండెపోటుతో హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో మృతిచెందిన రాజమౌళి భౌతికకాయాన్ని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కటారి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పి.రవిమారుత్, ఉపాధ్యక్షుడు డి.వి.వి.ఎస్ వర్మ తదితర నేతలు సందర్శించి నివాళులర్పించారు.

# యువసత్తా, ఆంధ్రా యూనివర్శిటీ

J.R.F., R.J.N.F. మరియు ఎటువంటి ఫెలోషిప్‌లో రాని రీసెర్చ్ స్కాలర్స్ SC, ST, BC, EBC, Minority రీసెర్చ్ స్కాలర్స్‌కు యూనివర్శిటీ నుండి ఫెలోషిప్‌లు ఇచ్చి ఆర్థికంగా ఆదుకోవాలని ఆంధ్రా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ శ్రీ G.S.N. రాజును కలిసి ఆంధ్రా యూనివర్శిటీ యువసత్తా అధ్యక్షుడు రెడ్డి లక్ష్మునాయుడు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఆర్థిక ఇబ్బందుల వలన పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేయాల్సి వస్తుందని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. గతంలో ఆంధ్రా యూనివర్శిటీ నుండి యూనివర్శిటీ ఫెలోషిప్‌లు ఇచ్చేవారని మరల వాటిని ప్రారంభించాలని కోరారు. కొన్ని రాష్ట్ర యూనివర్శిటీలు కూడా తమ ఆర్థిక స్తోమత మేరకు ఫెలోషిప్‌లు ఇచ్చి స్కాలర్స్‌ను ప్రోత్సహిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో



రీసెర్చ్ స్కాలర్స్ కె.విజయ్‌భాస్కర్, సురేష్‌మీనన్, విశ్వనాథ్, చక్రవర్తి, చెల్లయ్య, జగదీశ్వరరావు, పరమేశ్వరరావు, అప్పలరాజు, పి.శ్రీనివాస్, ఎస్.వి.నరసింహా, గణేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# వెంగళరావునగర్‌లో ఓటర్లనమోదు

బోరబండ డివిజన్ ఎన్ఆర్ఆర్‌పురం సైట్-3 హైటెక్ హోటల్ వద్ద యువసత్తా ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షులు సాంబిరెడ్డి మాట్లాడుతూ అందరూ ఓటర్లుగా చేరాలని అందుకు లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టామన్నారు.

ఈ రిజిస్ట్రేషన్‌లో దాదాపు 300 మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా నియోజకవర్గ కోశాధికారి శ్రీధర్, యువసత్తా అధ్యక్షులు జగదీష్, బీసీ సెల్ అధ్యక్షులు కాశీరావు పాల్గొన్నారు.



# 'గ్రీన్ జూబ్లీహిల్స్'

భావితరాలకు ఆహ్లాదకరమైన ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలని లోక్‌సత్తా పార్టీ జూబ్లీహిల్స్ నియోజక వర్గ అధ్యక్షులు సాంబిరెడ్డి అన్నారు. లక్ష్మీనరసింహ నగర్‌లోని శ్రీ సాయిగిరి పాఠశాలలో 'గ్రీన్ జూబ్లీహిల్స్' కార్యక్రమాన్ని లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మొక్కల పెంపకం వలన కలిగే లాభాలు, ఇంకుడు గుంతల ఆవశ్యకత, ప్లాస్టిక్ కవర్ల వినియోగంతో కలిగే అనర్థాలు, విద్యుత్తును, నీటిని పొదుపుగా ఎలా వాడుకోవాలి తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాంబిరెడ్డి, రాజు, అన్నపూర్ణ, సుధాశేఖర్, వెంకట్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



# సీసీ కెమెరాల ఏర్పాటుపై చర్చించండి



నగరంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చొరవ చూపాలని ఎమ్మెల్యే రాజేందర్‌కు మల్కాజిగిరి లోక్‌సత్తా నాయకులు వినతిపత్రం అందజేశారు. ఇటీవల నగరంలో జరిగిన బాంబుదాడుల దృష్ట్యా భద్రతాచర్యలు పెంచాలని ఆయనను కోరారు. ఇందులో భాగంగా ప్రధాన కూడళ్లు, వ్యాపార, వాణిజ్య సంస్థలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరముందన్నారు. ఎమ్మెల్యేని కలిసినవారిలో లోక్‌సత్తా మల్కాజిగిరి అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌వర్మ, ఉపాధ్యక్షుడు మురళి, పి.ఎస్.నవీన్, సంయుక్త కార్యదర్శి ప్రహ్లాద్, సన్ని తదితరులు పాల్గొన్నారు.

**అల్వాల్**

# ప్రజా సమస్యలపై గాసా, లోక్‌సత్తా ఆధ్వర్యంలో ధర్నా




రాజకీయ దళారులకు కొమ్ముకాస్తూ సాధారణ ప్రజానిక సమస్యలు పట్ల అధికారులు నిర్లక్ష్యధోరణిని ప్రదర్శిస్తున్నారని గాసా, లోక్‌సత్తా పార్టీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై గాసా, లోక్‌సత్తాల సంయుక్త ఆధ్వర్యంలో ర్యాలీతో పాటుగా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. గాసా కార్యదర్శి జి.వి.రావు, లోక్‌సత్తా మల్కాజిగిరి నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్‌వర్మల నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. అక్రమ లేఅవుట్లు, నిర్మాణాలు, పార్కులు, ఫుట్‌పాత్, చెరువుల ఆక్రమణలు తదితరాలపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. టౌన్‌ప్లానింగ్ విభాగం పూర్తిగా రాజకీయ దళారుల చేతిలో ఉందని పేర్కొన్నారు. అక్రమ లేఅవుట్లు, నిర్మాణాలపై ఫిర్యాదులు చేసిన పట్టించుకోని పరిస్థితి నెలకొని ఉందని తెలిపారు. ప్రజా ప్రతినిధులు ఒత్తిడుల మేరకు అక్రమాలపై టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించడం లేదని పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాలకు రెవెన్యూ విభాగం ఇంటినెంబర్లు మంజూరు చేయడం ఏమిటని ప్రశ్నించారు. చెరువుల అక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నా రెవెన్యూ శాఖ మొద్దు నిద్ర పోతోందన్నారు. అక్రమణలు కారణంగా పట్టణ పరిధిలో భూగర్భ జలాలు అడుగంటి పోయాయని పేర్కొన్నారు. ప్రజలను కేవలం ఆస్తిపన్నులు చెల్లించేవారిగానే అధికార యంత్రాంగం చూస్తోందని, సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధిలేదని ఆరోపించారు. ప్రజాసమస్యలపై పోరాటాలకు ఇది ఆరంభం మాత్రమేనని భవిష్యత్తులో మరింత ఉధృతంగా ఉంటుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గాసా అధ్యక్షుడు సంతోష్‌సింగ్, కాలనీ సంక్షేమ సంఘాలకు చెందిన ప్రతినిధులు రామచంద్రయ్య, సుభాష్‌గౌడ్, ప్రవీణ్, సన్ని, ప్రహ్లాద్, రాజేషమ్ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి రహిత సమాజానికి నర్సింగ్‌పల్లి ఆదర్శం కావాలి



అవినీతిరహిత సమాజానికి నర్సింగ్‌పల్లి రాష్ట్రం, దేశంలోనే ఆదర్శం కావాలని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జయప్రకాష్ నారాయణ్ గ్రామీణ ప్రజలకు పిలుపునిచ్చారు. నిజామాబాద్ మండలం నర్సింగ్‌పల్లిలోని మాపల్లె చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏకగ్రీవమైన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్ల ప్రమాణ స్వీకారోత్సవానికి జయప్రకాష్ నారాయణ్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే మండవ వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమానికి మాపల్లె చారిటబుల్ ట్రస్ట్ సలహాదారుడు నర్సింహారెడ్డి సభాధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జయప్రకాష్ నారాయణ్ మాట్లాడుతూ పంచాయితీ ఎన్నికల్లో గెలుపుకోసం లక్షల కోట్ల రూపాయలను ఖర్చు పెడుతున్నారన్నారు. ఎలాంటి డబ్బు, మద్యం పంపిణీ లేకుండా గ్రామస్థులు ఐకమత్యంగా ఉండి సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లను ఏకగ్రీవం చేసుకోవడం అభినందనీయ మన్నారు. పేదోడికి కావాల్సిన కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. ఎమ్మెల్యే మండవ మాట్లాడుతూ అవినీతి నిర్మూలనకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. చెప్పడానికి చాలా చెప్పొచ్చు, చేయడం సాధ్యం కాదన్నారు. అధికారులకు లంచం ఇచ్చి చుట్టూ తిరిగినా పనులు కావడం లేదన్నారు. అవినీతి వ్యవస్థను నిర్మూలించాలంటే గ్రామ స్థాయి నుంచే మొదలు కావాలన్నారు. ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి మాట్లాడుతూ నీతివంతమైన పాలన అందించడానికి ముందుకు వచ్చిన నర్సింగ్‌పల్లికి తమ సహకారం ఉంటుందన్నారు. టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఈగ గంగారెడ్డి మాట్లాడుతూ ఏ ఎన్నికలు చూసినా మద్యం, డబ్బు పంపకాలు జరుగుతున్నా యన్నారు.



### ఆలయాన్ని సందర్శించిన జయ ప్రకాష్ నారాయణ్

నర్సింగ్‌పల్లిలో నిర్మిస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానాన్ని జయప్రకాష్ నారాయణ్, మండవ వెంకటేశ్వర్‌రావు, ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి సందర్శించారు. పనులను నర్సింహారెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

### నిజాయితీపరులను ఎన్నుకోవాలి

**దోమకొండ :** స్థానిక సంస్థల పంచాయితీ ఎన్నికల్లో నిజాయితీ పరులను ఎన్నుకోవాలని లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ముత్యంపేటలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలు డబ్బులకు, మద్యానికి లొంగొద్దన్నారు. సమర్థుడైన నాయకున్ని ఎన్నుకున్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

కార్యక్రమంలో రాష్ట్ర లోక్‌సత్తా నాయకులు ఈద చెన్నయ్య, విజయేందర్‌రెడ్డి, గీతామూర్తి, జిల్లా నాయకులు మర్రి రాంరెడ్డి, శేఖర్, ఏ.కె.లత, పద్మాశేఖర్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలలో చదువు నామ మాత్రమే

ప్రభుత్వ పాఠశాలలలో అనేక వసతులు, ఆట స్థలాలు, గ్రంథాలయా సౌకర్యం, సైన్సు ల్యాబ్‌తో పాటు కంప్యూటర్ శిక్షణ, దూరప్రాంత విద్యార్థులకు బస్ సౌకర్యం, బి.ఈడి., యం.ఈడి.లలో శిక్షణ పొందిన ఉపాధ్యాయ గణం, ఏ తరగతిలో చేరి చదివినా ఫీజులు ఉండవు.

ప్రజల ఆకాంక్ష మేరకు ప్రత్యేకంగా ఇంగ్లీష్ మీడియంలో కూడా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.

చదువు మధ్యలో మానివేసిన బాలబాలికలను చదువు బాటలో ప్రయాణం చేయించడం.

ప్రభుత్వపరంగా ఈ పాఠశాలలలో చదవే విద్యార్థులకు ట్రిపుల్ ఐ.టి.లో ఉచితంగా చదివే అవకాశం కలిగిస్తుంది.

ఈ సౌకర్యాలే కాకుండా ఉచితంగా కర్షక, కార్మిక, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పిల్లలకు ప్రభుత్వం మధ్యాహ్న భోజనం పోషక విలువలతో అందిస్తుంది. ఉచితంగా పాఠ్య పుస్తకాలు, స్కూలు యూనిఫామ్ సమకూరుస్తుంది. నిపుణులైన వైద్యులచే కంటిచూపు పరీక్షలు, రక్త పరీక్షలు, సీజనల్ వ్యాధులు రాకుండా వివిధ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఉచితంగా మందులు విద్యార్థులకు అందజేస్తున్నారు.

మరియు లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్, వివిధ స్వచ్ఛంధ సంస్థలు పాఠశాలలలో చదివే విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్కూలు బ్యాగులు, పాదరక్షలు, మెడికల్ సర్వీసులు అందిస్తున్నారు.

ఈ విధంగా ప్రభుత్వం అనేక రకాలుగా విద్యను ప్రోత్సహిస్తూ రాష్ట్రంలో నిరాక్షరాస్యతను నిర్మూలించేందుకు కృషిచేస్తుంది.

***అయినా....***

సామాన్య ప్రజలు మొదలుకొని ధనిక ప్రజానీకం, వైట్ కాలర్ ఉద్యోగులు ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చదివించడానికి ఇష్టపడటం లేదు.

***అందుకు కారణాలు :***

- ప్రభుత్వ జీతభత్యాలు పొందుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించడానికి ఇష్టపడటం లేదు, చదివించడం లేదు. ప్రజలు ఈ విషయం ద్వారా ప్రభుత్వ పాఠశాలలలో చదువు నామ మాత్రమే అని అర్థం చేసుకొంటున్నారు.
- ఉపాధ్యాయుల బాధ్యతారాహిత్యం, చెప్పినా చెప్పకపోయినా తామకు జీతాలు వస్తాయని ప్రభుత్వ ఉపాధ్యాయులు బహిరంగంగా ప్రకటించడం.

పై కారణాలు ప్రభుత్వ విద్యా విధానంలోని లోపాలుగా ప్రజలు పరిగణనలోకి తీసుకొని విశ్వసిస్తున్నారు.

చర్చా వేదికలో అనేక విషయాలు తెలియజేయుటకు అవకాశం కల్పించగలరు.

**వంగర చంద్రశేఖర్, M.A.,**
ఛైర్మన్, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ,
జడ్.పి.హైస్కూల్, ఆకివీడు, ప॥ గో॥ జిల్లా.

## ప్రభుత్వ పాఠశాలలపై ప్రజా వేదిక

**మీ అభిప్రాయాలు రాయండి... ప్రభుత్వం కళ్ళు తెరిపించండి**

**చర్చకు ఆహ్వానం**

- **ప్రభుత్వ పాఠశాలలో ఫీజులు వుండవు**
- **పుస్తకాలు దాదాపు అందరికీ ఉచితం**

అయినా మనం పిల్లల్ని అక్కడికి పంపడం లేదు
ప్రయివేటు విద్యాసంస్థలకు జేబుల్లోంచి వేల రూపాయలు ఖర్చు చేస్తున్నాం

**మీకు తెలిసిన కారణాలు, మీ అనుభవాలను సంగ్రహంగా ఒకటి రెండు 'ఎ4' సైజు పేజీలకు మించకుండా అందేలా పంపండి.**

**ఆసక్తి గల విద్యావేత్తలు....తల్లిదండ్రులు ..... ఉపాధ్యాయులు .....**
**అందరినీ చర్చలో పాల్గొనాల్సిందిగా ఆహ్వానిస్తున్నాం.**

# ఉపాధితోనే మహిళ సాధికారత



కూకట్‌పల్లి నియోజకవర్గ లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో శ్రీమతి రాధా జయప్రకాష్ ఏర్పాటు చేసిన మహిళలతో ఇంటరాక్టివ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీలో పలువురు మహిళలు సభ్యత్వం తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన కెపిహెచ్‌బి ఆంధ్రా బ్యాంక్ మేనేజర్ సువర్చల మాట్లాడుతూ మహిళలు వృత్తి విద్యలు నేర్చుకొని స్వంతంగా ఉపాధి పొందాలని, బ్యాంక్‌లలో ఉద్యోగావకాశాలు చాలా ఉన్నాయని, అవసరమైతే వాటికి సలహాలు సూచనలు ఇస్తామన్నారు. శ్రీమతి రాధ మాట్లాడుతూ లోక్‌సత్తా పార్టీ ఇస్తున్న ఈ ఉచిత శిక్షణల ముఖ్య ఉద్దేశ్యం మహిళలు తమ కాళ్ళపై తాము నిలబడి ఇంటినీ, కుటుంబాన్ని చూసుకోవాలని, ఈ శిక్షణలు ఉపాధిగా కూడా ఉపయోగించుకోవాలని కోరారు. ఇవేకాకుండా ఇతర వృత్తి విద్యలలో నైపుణ్యం ఉన్నవారు ముందుకొచ్చి ఉచిత శిక్షణలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బాదినేని ప్రసాద్,నియోజకవర్గ అధ్యక్షులు కొమ్ము సత్తయ్య, ఇంచార్జీ ఎన్. శ్రీనివాసన్, ట్రైనర్ పద్మావతి, లోక్‌సత్తా నేతలు జీవనలత, పద్మజారాణి, గంగాభవానీ, ఉమారాణి, ఎస్.వి. సుబ్బారావు, బైరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కూకట్‌పల్లి**

# నియోజకవర్గ ప్రజలతో డా॥ జేపీ ముఖాముఖి



కూకట్‌పల్లి నియోజకవర్గ శాసన సభ్యులు డా॥ జయప్రకాష్ నారాయణ్ గారు ఉదయం 10-00 గం॥ల నుండి ఫతేనగర్ డివిజన్‌లో గల భగత్‌సింగ్ పార్కులో ప్రజలతో ముఖా-ముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలు సమస్యలు జేపీగారి దృష్టికి తీసుకొచ్చారు. వీటిలో ఫతేనగర్ ట్రాఫిక్ సమస్య గురించి తెలుపగా ట్రాఫిక్ ఎసిపి నాగరాజు గారితో ఫోన్‌లో మాట్లాడి సమస్య త్వరలో పరిష్కరిస్తాను అన్నారు. ఫతేనగర్ డివిజన్‌లో మూడు బ్రిడ్జిలు దీన్‌దయాల్‌నగర్, ఖైటాన్ ఫ్యాక్టరి మరియు పైప్‌లైన్ స్మశానవాటిక బ్రిడ్జిల గురించి అడుగగా జిహెచ్‌యమ్‌సి ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నిత్యానంద గారితో మాట్లాడగా టెండరింగ్ పూర్తయిందని, నిధులు మంజూరైనవని తెలిపారు. త్వరలో పనులు ప్రారంభిస్తారని తెలిపారు. ఎం.ఎం.టి.యస్. రైల్వే స్టేషన్ దగ్గర పరిశుభ్రంగా ఉంచాలని, ఇద్దరు పోలీసులను పెట్టించాలని కోరారు. హరిజన బస్తీలో గల టాయిలెట్స్ పడగొట్టి జిప్లస్ 2 పాఠశాల భవనం నిర్మించాలని కోరారు. తరువాత జేపీగారు నల్లపోచమ్మ గుడి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌యమ్‌సి అధికారులు డిఈ శ్రీధర్, ఏఈ రూపాదేవి, వాటర్ బోర్డు మేనేజర్ అప్పలనాయుడు, ఎలక్ట్రిసిటి ఏఈ వెంకటేష్ గౌడ్, లోక్‌సత్తా నేతలు డివిజన్ అధ్యక్షులు జి.సి.మహేష్, ఇన్‌చార్జి ఒగ్గు నరసింహా, నియోజకవర్గ అధ్యక్షులు కొమ్ము సత్తయ్య, ఇన్‌చార్జి ఎన్.శ్రీనివాసన్, ఉపేందర్‌రెడ్డి, వంశీప్రసాద్, రాదేశ్యామ్, రాజయ్య, వెంకటేష్, షఫీ, సలీమ్, జీవనలత, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

# "మీ-సేవ"లో డబ్బులిస్తేనే పని!

## నంద్యాల

మీ-సేవ కేంద్రాలు అవినీతికి నిలయాలుగా మారాయని, ముడుపులు చెల్లిస్తేనే పనులు జరుగుతున్నాయని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు మజీద్ ఆరోపించారు. స్థానిక బైర్మల్ వీధిలోని లోక్‌సత్తా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మీ-సేవ అవినీతిపై ఫ్లెక్సీని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి అన్ని రకాల సర్టిఫికెట్లను ఆఫీసుల చుట్టూ తిరగకుండా అందుతాయని చెప్పినా మీ-సేవ కేంద్రాల పనితీరు అధ్వానంగా ఉందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మీ-సేవ కేంద్రాల అవినీతిని నియంత్రించకపోతే ఉద్యమిస్తామన్నారు. మీ-సేవ కేంద్రాల అవినీతిపై రూపొందించిన ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ శౌరిరెడ్డి, జిల్లా కోశాధికారి సత్యనారాయణ, టౌన్ అధ్యక్షుడు హమీద్, కార్యదర్శి ప్రభాకర్, ఉపాధ్యక్షుడు సుధాకర్, యువసత్తా అధ్యక్షుడు దాస్, కార్యదర్శి ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.




# తిరుపతి కార్పొరేషన్‌కు సుపరిపాలన అందించండి



## తిరుపతి

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమీషనర్ టి. సకలారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు బెల్లంకొండ సురేష్ మాట్లాడుతూ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు సుపరిపాలన అందించాలని ముఖ్యంగా పారిశుద్ధ్యం, మంచినీరు మరియు దోమల బెడదపై శ్రద్ధ వహించాలని కోరారు. అందుకు కమీషనర్ సానుకూలంగా స్పందించి కూకట్‌పల్లి నియోజకవర్గంలో జయప్రకాష్ నారాయణ్‌గారితో కలిసి పనిచేశామని ఆయన సలహాలు సూచనలతో కూకట్‌పల్లిని ఎంతో అభివృద్ధి చేశామని, అదేవిధంగా తిరుపతి నియోజక వర్గాన్ని కూడా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు, కార్యదర్శి బాలసుబ్రమణ్యం, ప్రసాద్, హరి, శివ తదితరులు పాల్గొన్నారు.

# ఏ వృత్తిలో ఉన్నా జాతికి సేవ చేయాలి

యువత ఏ వృత్తిని ఎంచుకున్నా జాతికి సేవలందించడానికి ముందుకు రావాలని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు ఎమ్మెల్యే జయప్రకాష్ నారాయణ్ అన్నారు. వెంగళరావు నగర్ డివిజన్‌లోని సాగి రామకృష్ణంరాజు కమ్యూనిటీ హాల్లో సీఎంఎస్ ఐపీపీసీ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దేశంలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోలేక పోతున్నామన్నారు. రాజకీయ పార్టీల నాయకులు ఎలా దోచుకోవాలో ఆలోచిస్తున్నారు తప్ప దేశానికి ఏం చేద్దాం అనే కోణంలో ఆలోచించడం లేదన్నారు.




ఆధునిక ప్రపంచంలో డబ్బు ఎంత ఉన్నా దాన్ని సద్వినియోగం చేసుకున్నప్పుడే ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. బంగారాన్ని దాచుకోవడంలో ఎలాంటి లాభం లేదని దాన్ని పెట్టుబడులకు మళ్లించినప్పుడే ఉపాధి అవకాశాలు పెరిగి అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. మనం ఇతర దేశాల నుంచి 55 శాతం వంటనూనెలను దిగుమతి చేసుకుంటున్నాం తప్ప మనదేశంలో నూనె గింజలు పండించే విధంగా రైతులకు ఎందుకు అవకాశాలు కల్పించడంలేదని, దీనికి మన వ్యవస్థలోని లోపాలే కారణమన్నారు. ఏ దేశంలో లేనన్ని అవకాశాలు మనదేశంలో ఉన్నాయని వాటిని ఉపయోగించుకుంటే అన్ని రంగాల్లో దేశాన్ని ముందుకు నడిపించవచ్చన్నారు. దేశ భవిష్యత్తులో యువత ముఖ్య భూమికను పోషించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమర్థవంతమైన పౌరులుగా యువత తయారై సమాజ సేవే ధ్యేయంగా నడవాలన్నారు. సీఎంఎస్ ఛైర్మన్ చంద్రశేఖర్ మాట్లాడుతూ యువత సీఏ కోర్సుల్లో అత్యంత ప్రతిభను చాటుతున్నారన్నారు. సీఏ చదవడం వలన విద్యార్థులకు మంచి భవిష్యత్తుతో పాటు, జీవితంలో నిర్దిష్ట ప్రణాళిక ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ అధ్యక్షుడు సాంబిరెడ్డి, సీఎంఎస్ సీఏలు

**పంజాగుట్ట**

సుబ్రమణ్యం, సతీష్, కృష్ణారెడ్డి, శ్రీకాంత్, శ్రీధర్, రఘురామశర్మ, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీఏ విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు నిర్వహించిన ఫ్యాషన్ ట్రెండ్ షోలో యువకులు కేరింతలు కొట్టారు. ఎప్పుడూ పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులు తమకు నచ్చిన డ్యాన్సులతో సందడి చేశారు.

# నవ సమాజానికి.. నాంది పలకండి..

- వైఎస్ కళాశాలలో స్వరాజ్య ఉద్యమ శంఖారావం సదస్సు
- స్వరాజ్య ఉద్యమ స్థాపనకు యువత నడుం బిగించాలి
- డాక్టర్ వెలమాటి మనోహరి పిలుపు

## నరసాపురం



విలువలతో కూడిన నవ సమాజానికి యువత నడుం బిగించాలని స్వరాజ్య ఉద్యమ రాష్ట్ర సమన్వయ కర్త డాక్టర్ వెలమాటి మనోహరి పిలుపు నిచ్చారు. స్థానిక వైఎస్ కళాశాలలో నిర్వహించిన స్వరాజ్య ఉద్యమం శంఖారావం సదస్సుకు ఆమె హాజరై మాట్లాడారు. నేటి స్పీడ్ యుగంలో యువతరం కంప్యూటర్ రంగంపై ఎక్కువగా దృష్టి సారిస్తుందన్నారు. దేశ అభివృద్ధి, సమాజ పరిస్థితులపై కనీస అవగాహన పెంపొందించు కోవడం లేదన్నారు. దీని వల్ల సమాజంలో నెలకొన్న పరిస్థితులు వారి దృష్టికి రావడంలేదన్నారు. కావున బోధనతో పాటు సమాజ బాధ్యతలపై విద్యాసంస్థలు యువతకు అవగాహన కల్పించాలన్నారు. స్వరాజ్య స్థాపనే ప్రతి విద్యార్థి గుండె చప్పుడు కావాలన్నారు. అప్పుడే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధికి నోచుకుంటుందన్నారు. సర్వోదయ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ శిరిగినీడి నాగభూషణం మాట్లాడుతూ.. స్వరాజ్య ఉద్యమంలో యువత కీలకపాత్ర పోషించాలన్నారు. వైఎస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ ఇటువంటి సదస్సులు నిర్వహణ వల్ల యువతలో దేశ భావన పెరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థి దేశాభివృద్ధికి తన వంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గాంధీ అధ్యయన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ డి. వెంకటేశ్వరరావు, లోక్‌సత్తా నాయకులు ఐవి. రాజశేఖర్, మల్లుల వెంకటేశ్వరరావు, నల్లం సూర్యచంద్రరావు, అధ్యాపకులు డాక్టర్ చినమిల్లి శ్రీనివాస్, పివి.సుబ్బారావు, ప్రసాద్, అందే రమణ పాల్గొన్నారు.

# 'సెంటర్ ఫర్ డెమోక్రటిక్ సొసైటీ' ప్రారంభం

## సింహాచలం

ప్రజాస్వామ్యంపై పరిశోధనకు, ప్రజలకు అవగాహన కల్పించడానికి విశాఖలోని అడవివరంలో సెంటర్ ఫర్ డెమోక్రటిక్ సొసైటీని ప్రారంభించారు. తొలి పార్లమెంటేరియన్ కె.ఎస్.తిలక్ కుమార్తె అమలా నరసింహం సమక్షంలో అడవివరం గ్రామస్థులు మొక్కలు నాటి ఈ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సెంటర్‌కు వ్యవస్థాపక అధ్యక్షులుగా కె.ఎస్. తిలక్, కన్వీనర్‌గా పాత్రికేయుడు వి.ఎం.ఈశ్వర్, కో-కన్వీనర్‌గా పార్టీ రహిత ప్రజాస్వామ్యవాది యింటూరి సాంబశివరావు, లీగల్ అడ్వయిజర్‌గా రాష్ట్ర బార్ కౌన్సిల్ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ కందాళ శ్రీనివాసరావు వ్యవహరించనున్నారు. సెంటర్ అడ్వయిజరీ కమిటీ అధ్యక్షులుగా ప్రపంచ నాస్తికోద్యమ నాయకులు లవణం, రచయిత నరిశెట్టి ఇన్నయ్య, నల్సార్ లా యూనివర్శిటీ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ సభ్యులుగా వ్యవహరిస్తారు. అనంతరం జరిగిన సభకు దాడి గంగాధర్‌రావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఎయు జాయింట్ రిజిస్ట్రార్ నటరాజ్, ఎయు సోషల్ వర్క్ విభాగం ఆచార్యులు ఎబిఎస్‌వి రంగారావు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# కాలుష్య సమస్యలు - పరిష్కారాలు

మన థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులలో బొగ్గుకాలిన బూడిద కొన్నివేల టన్నులు నెలకి వ్యర్థ పదార్థంగా విడుదలవుతుంది. ఈ విషయం అందరికి తెలిసిందే. అయితే ఈ బూడిదని ఇటుకల తయారీలోనూ, సిమెంటు పరిశ్రమలోనూ విరివిగా వాడేటట్లు మన ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకోవడం, కొన్ని సిఫార్సులు చేయడం వల్ల బూడిదని భూమిలో కలిసిపోకుండా చాలావరకు ఆపగలుగుతున్నాం.

అలాగే వందకోట్లకి పైబడ్డ మన భారత దేశ జనాభా నుండి దైనందిత కార్యక్రమాలలో ప్రతి ఇంటినుండి పారవేసే చెత్త ఒక్క హైదరాబాద్ మహానగరంలోనే రోజుకు దాదాపు 5000 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతుందంటే ఆశ్చర్యపడతారు, కానీ ఇది సత్యం. ఇలా పోగైన చెత్తని ఇంధనంగా చేసుకొని చిన్న చిన్న పవర్ ప్రాజెక్టులు నడపవచ్చు. ప్రభుత్వం చాలా మందికి, చాలా కంపెనీలకు చెత్తతో పవర్ ప్రాజెక్టులు పెట్టుకోవడానికి పర్మిట్లు ఇచ్చింది. చాలా సంవత్సరాల క్రితం అనుమతులు పొందినా ఏవో ఒకటిరెండు మాత్రమే కార్యరూపాన్ని ఇచ్చాయి. చాలా కంపెనీలు ఆ సంగతే మరచి పోయినట్లున్నాయి.

ప్రభుత్వం ఆయా కంపెనీలపై ఒత్తిడి తెచ్చి... పవర్ ప్రాజెక్టులని ప్రారంభించేటట్లు చేస్తే... ఇటు కరెంటు కోతల నుండి కొంత బైటపడవచ్చు. అంతేకాక అటు చెత్త భారాన్ని కొంతవరకు తగ్గించుకున్న వాళ్ళమవుతాము. అంటే ఒక్క దెబ్బకి రెండు పిట్టలన్నమాట. ఇకనైనా సంబంధిత అధికారులు చెత్తని వదిలించుకునే దిశగా క్రియాశీలక నిర్ణయాలు తీసుకుంటారని ఆశిద్దాం!

**- నందనవనం సురేంద్రనాథ్**

# ప్రజా సమస్యలపై మున్సిపల్ కమీషనర్‌కు వినతి

**వినుకొండ**

వినుకొండ మున్సిపాలిటీ పరిధిలో నివసిస్తున్న ప్రజల స్థితి గతులపై సురాజ్య ఉద్యమం స్థానిక నేతలు సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో మున్సిపాలిటీ ద్వారా సరఫరా చేస్తున్న నీరు తాగడానికి పనికిరావడం లేదని, రోడ్ల నాణ్యతాప్రమాణాలు సరిగ్గా లేవని, వీధి దీపాలు వెలగడం లేదని తెలుసుకున్నారు. మున్సిపల్ కమీషనర్ కె. రామారావును కలిసి పై సమస్యలపై వారు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జుజ్జూరి ఐరామ్మూర్తి, టి. కొండలరెడ్డి, ఎం.ఎన్. ప్రసాద్, టి. నాగాచారి, సైదారావు, విద్యార్థి నాయకులు చరణ్‌తేజ, ఫారుక్ అబ్దుల్లా, రహీంబాషా, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సురాజ్య ఉద్యమ సర్వేలో తేలిన వాస్తవాలు

పట్టణ ప్రజలు మంచినీరు కొనుగోలుకై ఏటా 4.50 కోట్ల రూపాయలను వెచ్చిస్తున్నారని సురాజ్య ఉద్యమ కమిటి సర్వేలో తేలిందని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వేలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక వాస్తవాలు వెలుగు చూశాయని తెలిపారు. ప్రధానంగా డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉందని, తీవ్ర దుర్గంధం, దోమల తీవ్రత వీటివలన విషజ్వరాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. ఇంటింటికి తిరిగి చెత్తా, చెదారం సేకరించి దూరంగా పడవేసే విధానం ప్రవేశ పెట్టినందుకు మున్సిపాలిటీని అభినందించారు. కొన్ని ప్రాంతాలలో వీధిదీపాల అవసరాన్ని గుర్తించామన్నారు. అనేక ప్రాంతాలలో రోడ్ల విస్తరణ కావాల్సి ఉందని తెలిపారు. మౌలిక వసతులపై సురాజ్య ఉద్యమం గుర్తించిన వివరాలు ఎటువంటి రాజకీయం లేకుండా ప్రజలకు మేలైన సేవలు అందించటమే లక్ష్యంగా సురాజ్య ఉద్యమం పనిచేస్తుందని తెలియజేస్తూ వినుకొండ మున్సిపల్ కమీషనర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జె.ఐరామూర్తి, కొండలరెడ్డి, న్యాయవాదులు ప్రసాదు, సైదారావు, నాగాచారి, చరణ్‌తేజా, ఫారుక్, అబ్దుల్లా, రహింబాషా తదితరులు పాల్గొన్నారు.



రవీంద్రభారతిలో కాలేజ్ టాపర్స్ అవార్డ్స్ విద్యార్థులతో డా. జేపీ



భారత్ వికాస్ మొబైల్ మెడికల్ సర్వీస్‌ను ప్రారంభిస్తున్న డా. జేపీ



సంజీవదేవ్ గారి శతజయంతిలో పాల్గొన్న డా. జేపీ



ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ సమావేశంలో అధికారులతో డా. జేపీ



కూకట్‌పల్లిలో మహిళలకు స్వయం ఉపాధి కొరకు ఉచిత శిక్షణ



నరసరావుపేటలో గుర్తింపుకార్డులు పొందిన వారితో పార్టీ నేతలు




108 ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా అఖిలపక్ష సమావేశం

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2013-15



## నిజామాబాద్ జిల్లా గ్రామీణ ప్రజలతో జేపీ

To,

**Book-Post**

PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times
8-2-674B/2/9, Plot No. 93
Happy valley, Road No. 13A
Banjara Hills, Hyderabad - 500 034

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad